సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
సోమవారం, 08.06.2026

www.mudranews.in | @mudranews


సంపుటి:13 సంచిక: 217
పేజీలు: 08 వెల: రూ. 5

# ఏఐ దాహం..

## నీటికి ముప్పు!, యంత్రాలకే ఎక్కువ నీరు!

- డాటా సెంటర్లతో నీటి సంక్షోభం
- ఏఐ పెరిగితే నీటి కష్టం
- యూఎన్ హెచ్చరిక.. ఏఐపై ఆందోళన
- సర్వర్ల కోసం బిలియన్ గ్యాలన్ల నీరు
- ఏఐ భవిష్యత్ కు నీటి భయం!
- ఇలా అయితే ఏఐ పరిస్థితి అగమ్యగోచరమే

**ముద్ర, డెస్క్:**
ఏదైనా సరే వాడకం ఎక్కువైపోతే.. మొదటికే మోసం వస్తుంది. ఇప్పుడు ఏఐ విషయంలో కూడా అలానే జరిగే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే ప్రపంచం మొత్తం ఏ ఐ చుట్టూ తిరుగుతోంది. కంపెనీలు ఉద్యోగులను పక్కనపెట్టి ఏఐ ద్వారానే మిగతా 02లో




## నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వద్ద ఆంక్షలు

### చేప ప్రసాదం పంపిణీకి అన్ని ఏర్పాట్లు

- నేడు ఉదయం 6 గంటల నుంచి మంగళవారం రాత్రి 8 గంటల వరకు అమలు
- ప్రత్యామ్నాయ మార్గాలు..
- పార్కింగ్ ఏరియాల ఏర్పాటు

03





## తెలుగు రాష్ట్రాల్లోకి రుతుపవనాలు

### ఇక వేసవికి వీడ్కోలు..

02

- ఎండల తీవ్రత నుంచి ఉపశమనం
- నేటి నుంచి మరింత చల్లబడనున్న వాతావరణం
- నేడు పలు జిల్లాల్లో విస్తారంగా వర్షా లు
- ఉపశమనం పొందనున్న ప్రజలు



# పెరిగిన డిజిటల్ చెల్లింపులు

### పెద్ద నోట్ల రద్దు తర్వాత నగదు లావాదేవీలు తగ్గుముఖం

- టీషాపు నుంచి కార్పొరేట్ వరకు
- పెరిగిన క్యాష్ స్పెక్యూలేషన్

**మద్ర, డెస్క్:**
పెద్ద నోట్ల రద్దు తర్వాత దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు పెరిగిపోయాయి. అయితే చాలామంది ఆర్థికవేత్తలు డిజిటల్ చెల్లింపుల వల్ల నగదు లావాదేవీలు చాలా వరకు తగ్గిపోయాయని.. మామూలు టీ షాప్ నుంచి కార్పొరేట్ హోటల్ వరకు అన్నింట్లోనూ డిజిటల్ విధానంలో చెల్లింపులు జరుగుతున్నాయని చెబుతున్నారు. కానీ డిజిటల్ యుగంలో కూడా పాత పరిస్థితే ఉంది. చదువుతుంటే ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇదే విధంగా ఉంది. ఇప్పటి కాలంలో డిజిటల్ చెల్లింపులు పెరిగిపోయాయి. అలాగని నగదు చెల్లింపులు తగ్గుముఖం పట్టలేదు.
దేశంలో చలామణి అవుతున్న నగదు లెక్కలు ఇదే విషయాన్ని తేడా తెలియచేస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం 10 సంవత్సరాల కాలంలో ఇది మూడు రెట్లు పెరిగింది. 2017 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా నగదు చలామణి 13 లక్షల కోట్లు ఉండేది.. 2026 ఆర్థిక సంవత్సరానికి అదేకంగా 41 లక్షల కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో ఏటీఎం నెట్వర్క్ మాత్రం దారుణంగా పడిపోయింది. 2023లో 2.19 లక్షలకు పైగా ఏటీఎం యంత్రాలు ఉండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య 2.09 లక్షలకు పడిపోయింది. నగదు ఉపసంహరణలు కూడా 32.6 లక్షల కోట్ల నుంచి 28.6 లక్షల కోట్లకు పడిపోయాయి. మిగతా 02లో




## జూన్ 15 నుంచి బడులు

- విద్యాసంస్థల ప్రారంభం వాయిదా..
- మరో మూడు రోజుల అదనపు సెలవులు
- సెకండ్ సాటర్‌డేకు బదులు జులై 11న వర్కింగ్ డే

02


## తెల్లాపూర్ శాసనానికి కట్టేసి రాళ్లతో కొట్టండి

### టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



- ఉచిత విద్య, వైద్యం ఇవ్వకపోతే ఏ శిక్షకైనా సిద్ధం
- తెలంగాణను ప్రేమించే కొత్త రాజకీయ శక్తి గెలవాల్సిన అవసరం ఉంది
- ఇక్కడ మొత్తం మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలే
- బుల్లెట్ ట్రైన్ ఇవ్వకపోతే ఎంపీ రఘునందన్ రావు నోరు మెదపరు?
- బీజేపీని ప్రశ్నించాల్సిన మిగతా పార్టీలు ఎందుకు సైలెంట్ అయ్యాయి

06




# జనాభా సంక్షోభం

- ఫర్టిలిటీ లోపం కారణమా..
- ఆర్థిక పరిస్థితులా..
- చదువుకున్న వర్గంలోనే ఈ పరిస్థితి
- ప్రపంచీకరణ ప్రభావమా?

## భారత్ లో తగ్గిన జననాల రేటు

**ముద్ర, డెస్క్:**
భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద జనాభా కలిగిన దేశం.. యువతే మన బలం. ఇప్పటికీ యూత్ మన పవర్, ఎంపవర్.. అయితే ప్రపంచ వ్యాప్తంగా జననాల రేటు పడిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. దీర్ఘకాలిక జనాభా భారత భవిష్యత్తు గురించి కొత్త ఆందోళనలు మొదలయ్యాయి. ప్రపంచ కుబేరుడు, బిలియనీర్ ఎలాన్ మస్క్ ఇటీవల ట్వీట్ చేసిన వ్యాఖ్యలు ఈ అంశం చర్చనీయాంశం చేశాయి.

**పడిపోతున్న ఫెర్టిలిటీ రేటు..**
టోటల్ ఫెర్టిలిటీ రేటు అంటే ఒక మహిళ జీవితకాలంలో సగటున ఎంత మంది పిల్లలు కనగలదో సూచించే సంఖ్య. జనాభా స్థిరంగా ఉండాలంటే ఈ రేటు కనీసం 2.1 ఉండాలి. ఇటీవలి డేటా ప్రకారం భారత్ టోటల్ ఫెర్టిలిటీ రేటు దశాబ్దంలో 2.3 నుంచి 1.9కి పడిపోయింది. ఇది మొదటిసారి రీప్లేస్‌మెంట్ లెవల్ కంటే తక్కువకు దిగజారిన సందర్భం. విద్యావంతుల్లో బర్త్ రేటు చాలా కాలం క్రితమే పడిపోయింది. మస్క్ ప్రధానంగా హైలైట్ చేసిన అంశం ఇది. ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, ఆధునిక జీవనశైలి కారణంగా చదువుకున్న వర్గాల్లో జననాలు చాలా సంవత్సరాల క్రితమే తగ్గిపోయాయి. ఇది సమాజంలోని ఆర్థికంగా ముందున్న, నగరాల్లో నివసించే వర్గాలను ఎక్కువగా ప్రభావితం చేస్తోంది. మిగతా 02లో

# మరో భారీ అస్త్రం

### భారత్ అమ్ములపొదిలో మరో యుద్ధ విమానం

02

- ధర తక్కువ.. పని ఎక్కువ
- డిజైన్, ఇంజన్ సామర్థ్యం అధికం
- రష్యాతో కలిసి రూపొందించనున్న సుఖోయ్ ఎస్‌యూ–57





# ఏంటా సీక్రెట్?

### టీడీపీ నేతలకు చంద్రబాబు రహస్య సూచన

- నాయకులుగా ఎదగడానికి అవసరమైందా..?
- 'సీక్రెట్' అనేది పుస్తకం
- అది ప్రతి ఒక్కరు చదవాలని సూచన

**ముద్ర, డెస్క్:**
టీడీపీ నేతలకు చంద్రబాబు కీలక సూచన చేశారు. నాయకులుగా ఎదగడమే కాదు.. రాణించేందుకు కూడా కొన్ని విధానాలను అవలంభించాలని సూచించారు. టీడీపీ నేతలకు చంద్రబాబు కీలక సూచన చేశారు. నాయకులుగా ఎదగడమే కాదు.. రాణించేందుకు కూడా కొన్ని విధానాలను అవలంభించాలని సూచించారు. దీనికి తానే ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. తాను 'ది సీక్రెట్' అనే పుస్తకాన్ని నిరంతరం చదువుతున్నట్లు తెలిపారు. ఎప్పుడు చదివినా.. ఒక కొత్త విషయం నేర్చుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఈ పుస్తకం తెలుగులో కూడా అందుబాటులోకి వచ్చిందన్న ఆయన.. ప్రతి ఒక్కరూ 'సీక్రెట్' పుస్తకాన్ని చదవాలని సూచించారు. తద్వారా ప్రజలకు – నాయకులకు మధ్య సంబంధం ఏర్పడుతుందన్నారు.

**ఏంటీ పుస్తకం.. ?**
ఆస్ట్రేలియాకు చెందిన రచయిత రోండా బైర్న్ రాసిన 'ది సీక్రెట్' పుస్తకం ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. ప్రతి ఒక్కరిలోనూ అనేక కోరికలు ఉంటాయని, అభిలాషలు ఉంటాయని.. వాటిని సాధించేందుకు అనుగుణంగా అనుసరించాల్సిన వ్యూహాలనే.. 'ది సీక్రెట్' పుస్తకంలో రచయిత వివరించారు. ఈ పుస్తకం మిగతా 02లో



## హిట్లర్‌కు పట్టిన గతే నీకూ పడుతుంది

### సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్ రావు ఆగ్రహం

04



## దేవాలయాలుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు

05

### డిప్యూటీ సీఎం భట్టి

విద్యపై పెట్టే ప్రతి రూపాయి.. భవిష్యత్ తరాల కోసం పెట్టుబడి

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 08.06.2026
www.mudranews.in | @mudranews



## చేపలు తినడం వల్ల గుండెకు మేలు



చేపల్లో ఉండే ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. రక్తప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి.


# పెరిగిన డిజిటల్ చెల్లింపులు

(మొదటి పేజీ తరువాయి)
ఏటీఎంల సంఖ్య పడిపోవడంతో నగదును ఉపసంహరించుకోవడానికి చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకుల నుంచి ఏటీఎంలోకి వచ్చే నగదు పడిపోయిందని తెలుస్తోంది.. మార్చి, ఏప్రిల్ నెలల్లో.. మన దేశ వ్యాప్తంగా ఏటీఎంలో స్టోర్ చేసేందుకు 94 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. మార్చి నెలలో 61 వేల కోట్లు.. ఏప్రిల్ నెలలో 54 వేల కోట్లు మాత్రమే సమకూర్చారు. ఇక కేంద్రీకృత బ్యాంకు నివేదిక ప్రకారం గడిచిన నెల 22 నాటికి దేశంలో మొత్తం 42.54 లక్షల కోట్ల నగదు చలామణిలో ఉందని తెలుస్తోంది. ఇక ఏటీఎం లావాదేవీలు గతేడాదితో పోల్చి చూస్తే 10.4% తగ్గింది. ప్రజలు డిజిటల్ చెల్లింపుల వైపు ఆసక్తి చూపిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం విచిత్రంగా ఉంది. డిజిటల్ తో పాటు నగదు లావాదేవీలు కూడా ప్రజలు నిర్వహిస్తున్నారు. అందువల్ల క్యాష్ స్పెక్యులేషన్ కూడా విపరీతంగా ఉంది. అయితే వచ్చే రోజుల్లో ఇది తగ్గే అవకాశం ఉంటుందా.. పెరుగుతుందా.. అనే విషయాలను ఇప్పుడే చెప్పలేమని ఆర్థిక నిపుణులు అంటున్నారు.




# జనాభా సంక్షోభం





(మొదటి పేజీ తరువాయి)

**దీర్ఘకాలిక ప్రభావం..**

విద్య, సామాజిక ఎదుగుదల సానుకూలమైనప్పటికీ, ఇది జనాభా నిర్మాణంపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతుంది. జాతీయ స్థాయిలో టోటల్ ఫెర్టిలిటీ రేటు 1.9గా ఉన్నప్పటికీ, దక్షిణ రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఇది ఇంకా తక్కువ స్థాయిలో ఉంది. ఈ రాష్ట్రాల డేటా చార్ట్‌లో స్పష్టంగా కనిపించడం గమనార్హం. దక్షిణ భారతదేశం ఇప్పటికే జనాభా స్థిరీకరణ వైపు వేగంగా ముందుకు వెళ్తోంది. ఇది విద్య, ఆరోగ్యం, మహిళల సాధికారతలో సాధించిన పురోగతిని ప్రతిబింబిస్తుంది కానీ, భవిష్యత్తులో యువత లభ్యత, ఉద్యోగ శక్తి మీద ప్రభావం చూపవచ్చు.

**పతనానికి ప్రధాన కారణాలు..**

టోటల్ ఫెర్టిలిటీ రేటు పడిపోవడానికి నిపుణులు కొన్ని కారణాలు చెబుతున్నారు. అందులో ప్రధానమైనవి మహిళల విద్యా స్థాయి పెరగడం, వృత్తి అవకాశాలు పెరగడమే. మరో కారణం ఆలస్యంగా వివాహం, పిల్లలను కనడం. నగరీకరణ, ఆర్థిక ఒత్తిడి, జీవన వ్యయం పెరగడం కూడా పతనానికి మరో కారణం. కుటుంబ నియంత్రణ సాధనాలు, అవగాహన పెరగడం ఫెర్టిలిటీపై ప్రభావం చూపుతోంది.

**భవిష్యత్‌పై ప్రభావం..**

ఇప్పటికీ భారత్ యువ జనాభా కలిగిన దేశమే అయినా, కొన్ని దశాబ్దాల్లో వృద్ధాప్య జనాభా పెరగడం, డిపెండెన్సీ రేషియో పెరగడం, కార్మిక శక్తి తగ్గడం వంటి సవాళ్లు ఎదురవుతాయి. ఆర్థిక వృద్ధి, పెన్షన్ వ్యవస్థ, ఆరోగ్య సంరక్షణ మీద ఒత్తిడి పెరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా మస్క్ ఆందోళన చెందుతున్నట్లుగా, తక్కువ జననాలు దీర్ఘకాలికంగా సమాజాలను బలహీనపరుస్తాయి.

**పరిష్కారం ఏమిటి?**

జననాలను బలవంతంగా పెంచడం కాకుండా, సమతుల్య విధానాలు అవసరం. మహిళలకు మద్దతు (చైల్డ్‌కేర్, వర్క్–లైఫ్ బ్యాలెన్స్) యువతకు ఉపాధి, ఆర్థిక స్థిరత్వం ఉండాలి. ఆరోగ్యకరమైన వలస విధానాలు, జనాభా మార్పులకు అనుగుణంగా విద్య, సాంకేతికత, ఆటోమేషన్‌పై దృష్టి పెట్టాలి. భారత్ ఇప్పటికే డెమోగ్రాఫిక్ డివిడెండ్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకుంది. ఇప్పుడు డెమోగ్రాఫిక్ ట్రాన్సిషన్ తర్వాతి దశకు సిద్ధమవ్వాల్సిన సమయం ఇది. మస్క్ ట్వీట్ కేవలం హెచ్చరిక మాత్రమే కాదు.. భవిష్యత్తు గురించి సకాలంలో ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది.

# ఏంటా సీక్రెట్?

(మొదటి పేజీ తరువాయి)
విడుదలైన 2006 నుంచి కేవలం సంవత్సరకాలంలో కోటీ 90 లక్షల మంది కొనుగోలు చేశారు. 46 భాషలలోకి అనువదించిన పుస్తకంగా కూడా రికార్డు సృష్టించింది. ఈ పుస్తకం ఆధారంగా సినిమాను కూడా రూపొందించారు.
ముఖ్యంగా `ది సీక్రెట్` ఒక స్వీయ–సహాయక పుస్తకం. దీని ద్వారా ఎంచుకున్న రంగంలో విజయం సాధించడానికి అవసరమైన స్ఫూర్తిని అందిస్తుంది. ప్రజలు ఏ విషయాలను ఎలా చూస్తారో వివరిస్తుంది. ఇది వారిని విజయం, నిజమైన సంతోషం వంటి మార్గంలో నడిపిస్తుంది. ఈ పుస్తకం 'సూత్రాన్ని సజావుగా, సరైన విధంగా వినియోగించడానికి, సానుకూలంగా ఆలోచించడం వల్ల కలిగే గొప్ప ఆనందం, ఆరోగ్యం, సంపద ల నిధిని ఎలా దారితీస్తుందో వివరిస్తుంది. ప్రజలు ఆలోచించి అనుభూతి చెందుతున్నప్పుడు, వారు విశ్వానికి సంబంధిత ఫ్రీక్వెన్సీని పంపుతారని, అదే ఫ్రీక్వెన్సీ సంఘటనలు. పరిస్థితులను ఆకర్షిస్తుందని ఈ పుస్తకం పేర్కొంటుంది. ఒక వ్యక్తి ఎల్లప్పుడూ సానుకూలంగా, సరైన పద్ధతిలో ఆలోచించగలిగితే, దానివల్ల సహజంగానే ఎల్లప్పుడూ ఉత్తమ ఫలితాలను పొందుతాడనే విషయాన్ని ఈ పుస్తకం స్పష్టం చేస్తుంది. అభిప్రాయాలకు శాస్త్రీయ ఆధారం లేదు. ప్రజలు తమ కలలను, కోరికలను వ్యక్తీకరించడానికి సహాయపడే రెండు ప్రధాన శక్తివంతమైన ప్రక్రియలుగా దృశ్యరూపకత, కృతజ్ఞతలను ఈ పుస్తకం పేర్కొంది.

# ఏఐ దాహం..

(మొదటి పేజీ తరువాయి)
పనిచేయిస్తున్నాయి. కీలక ప్రాజెక్టులను సైతం ఏ ఐ ద్వారా పూర్తి చేస్తున్నాయి. దీంతో చాలా మంది ఐటీ ఉద్యో గులు ఉద్యోగాలను కోల్పోతున్నారు. రోడ్డున పడుతున్నారు.
ఏఐ వల్ల మనుషులకు సంబంధించి ఇది ఒక విపత్తు అయితే.. భవిష్యత్తు కాలంలో మరో విపత్తు కూడా పొంచి ఉంది. నిపుణులు చెబుతున్న దాని ప్రకారం.. ఆర్టిఫిషియల్ ఇంటెలీజెన్స్ టెక్నాలజీకి సంబంధించి సమాచార కేంద్రాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దీనిపై యునైటెడ్ నేషన్స్ ఆందోళన వ్యక్తం చేసింది. 2030 నాటికి 130 కోట్ల మందికి సరిపడా నీరు వీటికి అవసరమవుతుందని, సర్వర్లను చల్లపరిచేందుకు, విద్యుత్ వాడకానికి సంబంధించిన యంత్రాలను కూల్ చే సేందుకు విపరీతంగా నీరు కావాలి. ఫ్యూచర్ లో మనుషుల కంటే ఎక్కువ ఇవే వాటర్ తాగేస్తాయని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా ఫోటోలు, వీడియోలను జనరేట్ చేయడానికి ఎక్కువ ఎనర్జీ అవసరమవుతుందని.. కంపెనీలు, ప్రభుత్వాలు, యూసర్లు జాగ్రత్తగా ఉండాలని యునైటెడ్ నేషన్స్ ప్రకటించింది.
ఇటీవల కాలంలో డాటా సెంటర్ల ఏర్పాటు పెరిగిపోయింది. అదే సమయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం కూడా ఎక్కువైంది. ఈ టెక్నాలజీ ద్వారా ఫోటోలు రూపొందించడం.. వీడియోలు రూపొందించడం.. ఇంకా అనేక రకాల పనులు చేయడంతో టెక్నాలజీకి విపరీతంగా డిమాండ్ పెరిగిపోయింది. ఫలితంగా డాటా సెంటర్ల మీద ఒత్తిడి ఎక్కువైంది. డాటా సెంటర్ల పనితీరు పెరిగిపోతే.. విద్యుత్ చాలా అవసరం పడుతుంది. డాటా సెంటర్ల యంత్రాలను చల్లపరచాలి. ఇదంతా జరగాలంటే కచ్చితంగా నీరు కావాలి. ఆ నీటితోనే వాటిని కూల్ చేయవచ్చు.
ఇప్పుడంటే పర్వాలేదు కానీ.. భవిష్యత్తు కాలంలో నీటి వినియోగం ఇలానే పెరిగిపోతే అప్పుడు నీరు మరింత అవసరం పడుతుంది. ఇప్పటికే భూగోళంలో చాలావరకు ప్రాంతాలలో నీటి కొరత తీవ్రంగా ఉంది. భవిష్యత్తు కాలం ఎలా ఉంటుందో చెప్పలేము. పైగా ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ వాడకం విపరీతంగా పెరిగిపోతుంది. అలాంటప్పుడు డాటా సెంటర్లకు కావలసిన నీటిని ఎలా సరఫరా చేస్తారు అనేది ఇక్కడ అసలైన ప్రశ్న. అందువల్లే టెక్నాలజీని పరిమిత స్థాయిలో వాడుకోవాలని.. అనవసరమైన కార్యకలాపాలకు టెక్నాలజీని ఉపయోగించుకుంటే పరిణామాలు వేరే విధంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. సాధ్యమైనంతవరకు నేచురల్ రిసోర్సెస్ మీద ఒత్తిడి పడకుండా చూసుకోవాలని ఎక్స్ పర్ట్స్ అంటున్నారు.



# తెలుగు రాష్ట్రాల్లోకి రుతుపవనాలు

**ముద్ర, డెస్క్:**
రెండు రోజుల క్రితం కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు ఈ రోజు రాష్ట్రంలో అడుగుపెట్టాయని భారత వాతావరణ శాఖ అధికారులు అధికారికంగా వెల్లడించారు. దీంతో తెలుగు ప్రజలకు ఎండల తీవ్రత నుంచి ఉపశమనం లభించనుంది. ప్రస్తుతం రుతుపవనాలు రాష్ట్రంలో చురుగ్గా కదులుతుండటంతో వాతావరణం చల్లబడే అవకాశం ఉందని చెబుతున్నారు. నిజానికి ఈ ఏడాది మూడు రోజుల ఆలస్యంగా రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించాయని చెబుతున్నారు. ఎల్నినో భయాల మధ్య రుతుపవనాలు సమయానికి రావడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. తెలంగాణ, రాయలసీమ, దక్షిణ కోస్తాలో విస్తరణ రుతుపవనాలు ఇప్పటికే రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో విస్తరిస్తున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ఇవి మరింత ముందుకు సాగడానికి, రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించడానికి వాతావరణం ఎంతో అనుకూలంగా ఉందని ఐఎండీ అధికారులు పేర్కొన్నారు. రాబోయే రెండు మూడు రోజుల్లో మిగిలిన ప్రాంతాలకు కూడా రుతుపవనాలు విస్తరించే అవకాశం ఉందని చెబుతున్నారు. రుతుపవనాల రాకతో రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని, ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రుతుపవనాల కదలికలు చురుగ్గా ఉన్నందున, రైతులు తమ వ్యవసాయ పనులకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవచ్చునని స్పష్టం చేస్తున్నారు. అయితే భారీ వర్షాల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**తగ్గనున్న ఎండల తీవ్రత**

గత కొన్ని వారాలుగా భానుడి కారణంగా తీవ్రమైన ఉక్కపోతతో అల్లాడిపోయిన జనం ఈ చల్లటి కబురుతో ఊపిరి పీల్చుకుంటున్నారు. రుతుపవనాల ప్రభావంతో తెలుగు రాష్ట్రాలలో ఎండల తీవ్రత క్రమంగా తగ్గుముఖం పడుతుందని అంచనా వేస్తున్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గి వాతావరణం ఆహ్లాదకరంగా మారుతోందని చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండల తీవ్రత విపరీతంగా ఉంటోంది. దాదాపు 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో జనం నరకం అనుభవిస్తున్నారు. జూన్ రావడంతోనే వాతావరణం చల్లబడుతుందని ఆశించినా తొలి వారం మాత్రం ఎండ మంటలు తప్పలేదని వాపోతున్నారు. ఇక రుతుపవనాలు రాకతోనైనా పరిస్థితిలో మార్పు వస్తుందని ఆశిస్తున్నారు.

# జూన్ 15 నుంచి బడులు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్రంలో విద్యాసంస్థల పునఃప్రారంభం తేదిని ప్రభుత్వం పొడగించింది. ఈ నెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కావాల్సి ఉండగా.. వేసవి సెలవులను ఈ నెల 14 వరకు పొడిగించింది. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు జూన్ 12న తెరిచినప్పటికీ, ఆ మరుసటి రోజు రెండో శనివారం (సెకండ్ సాటర్‌డే) వస్తోంది. 14న ఆదివారం కావడంతో వరుసగా రెండు రోజులు సెలవులు వస్తున్నాయి. ఒక రోజు స్కూల్ తెరిచి మళ్లీ రెండు రోజులు సెలవులు ఇవ్వడం కంటే, ఈ సెలవులు ముగిసిన తర్వాత జూన్ 15 నుంచే పూర్తి స్థాయిలో పాఠశాలలను పునఃప్రారంభించడం ఉత్తమమని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది.

**జులై 11న వర్కింగ్ డే..**

జూన్ 13న రెండో శనివారం సెలవును విద్యార్థులకు ముందే ఇస్తున్నందున, దానికి బదులుగా జులై 11న వచ్చే రెండో శనివారాన్ని పాఠశాలలకు పనిదినం (వర్కింగ్ డే)గా పరిగణిస్తామని ప్రభుత్వం తన ప్రకటనలో స్పష్టం చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో విద్యార్థులకు మరో మూడు రోజులు అదనంగా సెలవులు లభించినట్లయింది.




# మరో భారీ అస్త్రం



**ముద్ర, డెస్క్:**
ప్రపంచంలో తమదే అత్యాధునిక యుద్ధ విమానం అని అమెరికా ఎఫ్ – 35 స్టెల్త్ విమానాల గురించి ప్రచారం చేసుకుంటోంది. ట్రంప్ కూడా వ్యాపారం పెంచుకునేందుకు ప్రపంచ దేశాల్లో ప్రచారం చేస్తున్నాడు. అయితే తాజాగా ఇరా న్‌తో యుద్ధం సందర్భంగా ఇరాన్ ఎఫ్–35 యుద్ధ విమానాన్ని భుజంపై తీసుకెళ్లే లాంచర్‌తో కూల్చివేసింది. దీంతో ఎఫ్–35 ప్రచారంలో లోపాన్ని బయట పెట్టింది. ఈ క్రమంలో భారత్ అమెరికా ఆధునిక యుద్ధ విమానాలకు దీటుగా రష్యాతో కలిసి సుఖోయ్ ఎస్‌యూ–57 యుద్ధ విమానాన్ని మరింత అభివృద్ధి చేసి, ఉమ్మడి ఉత్పత్తి చేయాలని ప్రతిపాదించారు. ఇది రెండు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని మరింత పెంచనుంది. ఎస్‌యూ–57 రష్యా మొదటి పూర్తి స్థాయి ఐదో తరం స్టెల్త్ ఫైటర్‌గా పరిగణింపబడుతుంది. దీన్ని అమెరికా ఎఫ్–22 రాప్టర్, ఎఫ్–35 లైట్నింగ్–2 విమానాలతో సమానంగా రూపొందించారు.

**డిజైన్, ఇంజిన్ సామర్థ్యాలు..**

ఎస్‌యూ–57 సింగిల్ సీట్, రెండు ఇంజిన్లతో కూడిన బహుళ ప్రయోజనకర విమానం. ప్రస్తుతం శాటర్న్ ఏఎల్–41ఎఫ్1 ఇంజిన్లు ఉపయోగించబడుతున్నాయి. ఇందులో మరింత అధునాతన ఏఎల్–51ఎఫ్1 ఇంజిన్ ను అంతర్గతంగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. రెండు ఇంజిన్ల వల్ల ఒకటి పని చేయకపోయినా విమానం సురక్షితంగా తిరిగి రాగలదు. ఇది ఎఫ్–35లోని సింగిల్ ఇంజిన్ డిజై న్‌తో పోలిస్తే భిన్నమైన లాభం. ఆయుధాలను విమానం లోపల (స్టెల్త్ మోడ్‌లో), బయట కూడా మోసుకెళ్లవచ్చు. దీంతో గాలి నుంచి గాలి లక్ష్యాలు, గాలి నుంచి నేల లక్ష్యాలను కచ్చితంగా ఛేదించే సామర్థ్యం ఉంది.

**వేగం, సూపర్ క్రూయిజ్ ప్రయాణ సామర్థ్యం..**

ఇది మాక్ 2.0 వేగాన్ని చేరుకునే సూపర్ సోనిక్ విమానం. గంటకు సుమారు 2,458 కిలో మీటర్ల వేగంతో దూసుకెళ్లగలదు. ఆఫ్టర్‌బర్నర్ లేకుండానే మాక్ 1.3 వేగంతో సూపర్ క్రూయిజ్ చేయగలదు. దీని వల్ల ఇంధనం ఆదా అవుతుంది, స్టెల్త్ లక్షణాలు మరింత మెరుగవుతాయి. ఒక్కసారి ఇంధనం నింపుకుంటే దాదాపు 1,900 కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణించగలదు. ఇది ఎఫ్–35 సాధారణ పరిధి (సుమారు 1,100 కి.మీ.) కంటే గణనీయంగా ఎక్కువ. అధునాతన రాడార్, సెన్సార్ వ్యవస్థలు దీనికి అదనపు బలం ఇస్తాయి.

**స్టెల్త్ సామర్థ్యం, ఆధునిక వ్యవస్థలు..**

ఆధునిక గాలి రక్షణ వ్యవస్థలకు తప్పించుకునేలా రూపొందించబడిన ఈ విమానం స్టెల్త్ టెక్నాలజీని కలిగి ఉంది. అత్యాధునిక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సామర్థ్యాలు, సెన్సర్ ఫ్యూజన్ దీన్ని గగనతలంలో ఆధిపత్యం చలాయించేలా చేస్తాయి. అయితే, అమెరికా విమానాల మాదిరిగా అన్ని కోణాల్లోనూ పూర్తి స్టెల్త్ కాకపోవచ్చని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ధర తక్కువ.. పని ఎక్కువ..**

ఒక్కో ఎస్‌యూ–57 విమానం ధర సుమారు 35 నుంచి 50 మిలియన్ డాలర్ల మధ్య ఉంటుంది. అదే సమయంలో ఎఫ్–35 ధర 80 నుంచి 100 మిలియన్ డాలర్ల వరకు ఉంటుంది. ఈ తక్కువ ఖర్చు, ఉమ్మడి ఉత్పత్తి సాధ్యత భారత్‌కు ఆర్థికంగా, సాంకేతికంగా ప్రయోజనకరం. ఇది 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి దోహదపడవచ్చు.

**అమెరికా విమానాలతో పోలిక..**

ఎఫ్–22 రాప్టర్ ఎయిర్ సూపీరియారిటీలో అత్యుత్తమం. అయితే ఎస్‌యూ–57 తక్కువ ధర, మంచి పరిధి, సూపర్ మెన్యూవరబిలిటీలో పోటీ పడుతుంది. ఎఫ్–35 లైట్నింగ్ 2 సెన్సార్ ఫ్యూజన్, నెట్‌వర్క్ సెంట్రిక్ వార్‌ఫేర్‌లో ముందంజలో ఉంది. కానీ ఎస్‌యూ–57 రెండు ఇంజిన్లు, ఎక్కువ వేగం, సూపర్ క్రూయిజ్, తక్కువ ధరలో ఆధిక్యత చూపుతుంది. మొత్తం మీద ఎస్‌యూ–57 వేగం, పరిధి, ఖర్చు, బహుళ ప్రయోజనాల్లో బలమైన ప్రదర్శన ఇస్తుంది. అయితే అమెరికా విమానాలు స్టెల్త్, ఏవియానిక్స్ ఇంటిగ్రేషన్‌లో ముందున్నాయి. భారత్‌తో జాయింట్ డెవలప్‌మెంట్ జరిగితే రెండు దేశాలూ సాంకేతికంగా లాభపడి, ఈ విమానాన్ని మరింత ఆధునికం చేయవచ్చు. ఈ ప్రతిపాదన భారత వైమానిక దళం ఆధునికీకరణకు కీలకమైన అవకాశం.



# హీరో అన్నామలై

**ముద్ర, డెస్క్:**
అన్నామలై ఐపీఎస్ ఆఫీసర్ గానే మాకు తెలుసు.. ఆ పదవికి రాజీనామా చేసిన తర్వాత రాజకీయ నాయకుడిగానే తెలుసు.. ఇప్పుడు బిజెపి నుంచి పక్కకు తప్పుకొని.. సొంత పార్టీ పెడుతున్న వ్యక్తిగానే తెలుసు.. కానీ ఆయన ఎ ప్పుడు హీరో అయ్యాడు.. ఎప్పుడు సినిమాలు తీశాడు.. అవి ఎప్పుడు విడుదలయ్యాయి.. ఇప్పుడు ఎందుకు మళ్ళీ రీ రిలీజ్ అవుతున్నాయి.. ఇన్ని ప్రశ్నలు మీలో వ్యక్తం అవుతున్నాయి కదా.. వాటన్నింటికీ సమాధానమే ఈ కథనం.
తమిళనాడు రాష్ట్రంలో ఇప్పుడు అక్కడి రాజకీయాలను తన చుట్టూ తిప్పుకుంటున్నాడు అన్నామలై. బిజెపికి రాజీనామా చేసిన తర్వాత ఆయన సొంత పార్టీ పెట్టుకునే ఆలోచనలో ఉన్నాడు. దానికంటే ముందు ఆయన వీ ది లీడర్స్ అనే సంస్థను ఏర్పాటు చేశాడు. ఆన్లైన్లో ఒక ఉద్యమాన్ని మొదలుపెట్టాడు. ఆయన ఏర్పాటుచేసిన ఈ సంస్థకు సోషల్ మీడియాలో భారీ ఎత్తున స్పందన వస్తోంది. ఈ క్రమంలో అన్నామలై ఏర్పాటు చేసిన వీ ది లీడర్స్ సంస్థపై టీవీకే నేతలు రియాక్ట్ అయ్యారు.
అన్నామలై ఏర్పాటుచేసిన వీ ది లీడర్స్ అనే సంస్థ మళ్ళీ విడుదల చేసిన పాత చిత్రం లాంటిదేనని.. ఈ ఉద్యమం ప్రజలను అంతగా కదిలించదని టీవీకి నేతలు అంటున్నారు. ప్రతిసారి మళ్లీ విడుదలైన చిత్రాన్ని ప్రజలు అంతగా చూడరు. అన్నమలై పరిస్థితి ఏమిటో ఆయనకు తెలుసు. అలాంటప్పుడు తమిళనాడు రాజకీయాలలో ఏ మేరకు ఆయన ప్రభావం చూపించగలరు అంటూ టీవీకే నేత.. మంత్రి కేజీ అరుణ్ రాజు ఆరోపించారు.. 'బిజెపిలో ఆయన పరిస్థితి బాగోలేదు. అందువల్లే బయటికి వచ్చారు. ఎన్నికల్లో ఆయన సేవలను పార్టీ ఎలా ఉపయోగించుకుందో అందరికీ తెలుసు. పైగా ఆయన నాయకత్వంలో బిజెపి తమిళనాడులో ఏ స్థాయిలో ఎదిగిందో కూడా అందరికీ తెలుసు. అలాంటప్పుడు ఆయన ఏదో సంస్థ పెడితే తమిళనాడు రాజకీయాలు ఎలా మారిపోతాయి. తమిళనాడు ప్రజలు విజయ్ నాయకత్వాన్ని కోరుకున్నారు. అందువల్లే ఈ స్థాయిలో తమిళనాడు రాష్ట్రానికి ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ముఖ్యమంత్రి స్థానం మీద అందరికీ ఆశలుంటాయి. అందులో తప్పులేదు. కానీ ముఖ్యమంత్రి కావడం అంత సులభం కాదని" అరుణ్ రాజ్ పేర్కొన్నారు.
అన్నామలై ఏర్పాటు చేసిన వీ ది లీడర్స్ క్యాంపెయిన్ లో ఇప్పటికే లక్షల మంది రిజిస్టర్ చేసుకున్నారు. అసంఖ్య 15 లక్షలను దాటిపోయింది. ఈ జోరు ఇలాగే కొనసాగితే అది త్వరలోనే మరింత పెరిగే అవకాశం ఉంది. అదే గనక జరిగితే తమిళనాడు రాజకీయాలలో సంచలనం నమోదు కావడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 08.06.2026
www.mudranews.in | @mudranews



### చేపలు తినడం వల్ల మెదడు పనితీరు మెరుగుదల




జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరగడానికి చేపలు ఉపయోగపడతాయి. మెదడు కణాల ఆరోగ్యాన్ని కాపాడుతాయి.

# బాచుపల్లి ఫ్లై ఓవర్ నేడు ప్రారంభం.. ట్రాఫిక్ సమస్యలకు ఊరట

**ముద్ర, కుత్బుల్లాపూర్:**

మియాపూర్–గండిమైసమ్మ కారిడార్‌లో కీలకమైన బాచుపల్లి ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు. సుమారు 1.3 కిలోమీటర్ల పొడవుతో నిర్మించిన ఈ నాలుగు లేన్ల ఫ్లైఓవర్ వల్ల మియాపూర్, నిజాంపేట్, మల్లంపేట్, బాచుపల్లి, గండిమైసమ్మ ప్రాంతాల మధ్య ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గనుంది. అత్యంత రద్దీగా ఉండే బాచుపల్లి చౌరస్తాలో సిగ్నల్ ఫ్రీ ప్రయాణానికి ఈ ప్రాజెక్టు దోహదపడనుండగా, వాహనదారులకు రోజూ సుమారు 20 నిమిషాల ప్రయాణ సమయం ఆదా కానుంది. ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంతో





పాటు మియాపూర్ ఫ్లైఓవర్, బాచుపల్లి–మియాపూర్ క్రాస్‌రోడ్స్ అండర్‌పాస్, ఆల్విన్ క్రాస్ రోడ్స్–హఫీజ్‌పేట్ అండర్‌పాస్ ప్రాజెక్టులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి రావడంతో ఐటీ కారిడార్ వైపు ప్రయాణించే ఉద్యోగులు, స్థానిక ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గి రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి.



## ‘ఆమె.. ఒక విజేత’ ఆవిష్కరణ

**ముద్ర, హైదరాబాద్:** ప్రముఖ రచయిత్రి పింగిలి కవితారెడ్డి రచించిన "ఆమె.. ఒక విజేత" పుస్తకాన్ని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని జేడీ ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జేడీ లక్ష్మీనారాయణతో పాటు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ అనంతలక్ష్మి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... పింగిలి కవితా రెడ్డి తాజాగా రచించిన ఆమె.. ఒక విజేత పుస్తకంతో పాటు గతంలో రచించిన తొలి అడుగు, అంతరంగాలు.. అనంతరంగాలు పుస్తకాలను కూడా జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రచురించినట్లు తెలిపారు. మనిషిలోని భావాలను ప్రకటించడానికి చాలా మాధ్యమాలు ఉన్నాయని, రచయిత్రి కవితా రెడ్డి వాటిని పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమని అన్నారు. జీవితంలో ఒడిదొడుకులు ఎదుర్కొంటూ, జీవన పోరాటం చేస్తున్న మహిళలకు ఈ పుస్తకం ఒక దిక్సూచిలా పనిచేస్తుందని అన్నారు. డాక్టర్ అనంతలక్ష్మి మాట్లాడుతూ... సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలతో పాటు.. వాటిని అధిగమించి ఎలా విజేతలుగా నిలవాలో ఈ పుస్తకంలో కవితా రెడ్డి పొందుపరిచినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు నాగ మోహన్, సుప్రియ, అరుణ, సాయి, దేవిక, రాజు, దేవేందర్, నరేష్, ఛాయాదేవి, రోషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ కే. రాజ్ కుమార్ రెడ్డికి డాక్టరేట్

**- సామాజిక సేవలకు అంతర్జాతీయ గుర్తింపు..**

**ముద్ర, నారాయణపేట:** సమాజ శ్రేయస్సు కోసం విశేష సేవలు అందిస్తున్న భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కే. రాజ్‌కుమార్ రెడ్డికి అమెరికాలోని డల్లాస్ యూనివర్సిటీ డాక్టరేట్ పురస్కారం ప్రదానం చేసింది. గుడి గోపురాల నిర్మాణం, జాబ్ మేళాలు, వైద్య సహాయం, తాగునీటి సదుపాయాలు, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం వంటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆయన గుర్తింపు పొందారు.



సామాజిక సేవా రంగంలో చేస్తున్న కృషిని గుర్తించి హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ డాక్టరేట్ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కే. రాజ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, డాక్టరేట్ తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని తెలిపారు.

## గురుభక్తి చాటుకున్న బిగ్ బాస్ ఫేమ్ రాము రాథోడ్



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్స్‌లో సాయి లహరి ఆర్ట్స్ అకాడమీ, కూచిపూడి భరతనాట్య కళా క్షేత్రం మరియు రుద్ర డేర్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి కాలపు సాంస్కృతిక శిక్షణ తరగతుల ముగింపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యువ హీరో రాము రాథోడ్ హాజరయ్యారు. వేసవి శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులు నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు.

అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు రాము రాథోడ్ చేతుల మీదుగా ట్రైనింగ్ సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను ఒకప్పుడు నాగర్‌కర్నూల్‌లో పోలోజి సత్యం అకాడమీలోనే శిక్షణ పొందానని, నేడు ఈ స్థాయికి చేరుకోవడంలో తన గురువు చేసిన కృషి ఎంతో కీలకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కళాగురువు పోలోజి సత్యంను ఘనంగా సన్మానించిన రాము రాథోడ్, గురువుకు పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో సాయి లహరి, కొట్ర బాలాజీ, పద్మాలయ ఆచార్య, ముక్తావళి, మురళీధర్, డాన్స్ మాస్టర్లు వెంకీ, వినయ్, పల్లవి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రుతితో పాటు పెద్ద సంఖ్యలో సాంస్కృతిక కళాకారులు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సమాజానికి మార్గదర్శకులు కావాలి

**ముద్ర కాప్రా:** విద్యార్థులు భవిష్యత్తులో సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. కాప్రా విజయ స్కూల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యలో ఉత్తమప్రతిభను కనబరచిన ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు తన వంతు అన్ని రకాలుగా సహాయ సహకారాలను అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు పాఠశాల టాపర్ గా నిలిచిన సాహితీ – 584 మార్కులు ఎమ్మెల్యే చేతుల మీదుగా రూ.10,000 లను, మేఘ నాల హరి–582 మార్కులు రూ.7500లు, వరునిక–579 మార్కులు రూ.5000 లతో పాటు శాలువ, మెమంటోలతో సత్కరించారు. 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు 92 మందికి జ్ఞాపికలు, శాలువాలతో యాజమాన్యం ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్సీ జనార్ధన్ రెడ్డి, సీని యర్ మైనారిటీ కాప్రా ప్రెసిడెంట్ బద్రుద్దీ న్, కాప్రా టీఆర్ఎస్ యూత్ లీడర్ నవీన్ గౌడ్, యూత్ లీడర్ మహేష్ గౌడ్, పాఠశాల చైర్మన్ కొప్పునూరి బసప్ప, వ్యవస్థాపకురాలు విజయ లక్ష్మి, విజయ ఎడ్యు కేషనల్ సొసైటి వైస్ ప్రెసిడెంట్ శెట్టి చంద్రశేఖర్, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## ఉత్సాహంగా ఫిట్ ఇండియా సండేస్ అన్ సైక్లింగ్

**- ర్యాలీ ని ప్రారంభించిన రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా**

**ముద్ర, హైదరాబాద్:**

ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా ఫిట్ ఇండియా సండేస్ అన్ సైక్లింగ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియం వేదికగా నిర్వహించిన సైకిల్ ర్యాలీకి నగరంలోని సైక్లిస్టుల నుండి విశేష స్పందన లభించింది. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు వాకిటి శ్రీహరి రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయష్ రంజన్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండి డాక్టర్ సోనీ బాలదేవి తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రంలో విస్తృతస్థాయిలో నిర్వహిస్తున్నరని, రాష్ట్రంలో అద్భుతమైన క్రీడా ప్రతిభ ఉందని గవర్నర్ అన్నారు. విస్తృత స్థాయిలో వివిధ క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడా శాఖను ఆయన అభినందించారు.

మంత్రులు శ్రీధర్ బాబు వాకిటి శ్రీహరి క్రీడల సలహా దారులు ఏపీ జితేందర్ రెడ్డి చైర్మన్ శివసేనా రెడ్డి లో ముందు వరుసలో



సైకిల్ తొక్కుతూ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. గచ్చిబౌలి స్టేడియం ప్రాక్టీస్ గ్రౌండ్..ప్రధాన ద్వారం నుంచి ప్రారంభమైన ఈ సైక్లింగ్ ర్యాలీ ఐఐఐటీ జంక్షన్, గచ్చిబౌలి ఫ్లైఓవర్, పిస్తా హౌస్ జంక్షన్, బిట్స్, కేబుల్ బ్రిడ్జ్, మాదాపూర్, భారతీయ విద్యాభవన్ సెంటర్ రోడ్, బయోడైవర్సిటీ రోడ్ మీదుగా ప్రయాణించి తిరిగి గచ్చిబౌలి స్టేడియానికి చేరుకుంది

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి ,స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు కోచులు వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు సైక్లింగ్ అసోసియేషన్లు సైకిల్ యువ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇందులో పాల్గొన్న ప్రతి సైకిలిస్టుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరఫున సర్టిఫికెట్, మెమెంటోలు అందజేశారు.


## దేశ సేవ చేయాలన్న ఆలోచన ఎంతో గొప్పది

**- టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గవినోళ్ళ శ్రీనివాస్**

**- ఆర్మీకి ఎంపికైన యువ జవాన్లకు సన్మానం**

**ముద్ర, నారాయణపేట:**

ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఇండియన్ ఆర్మీకి ఎంపికైన యువ జవాన్లకు మిల్క సింగ్ అకాడమీ – పల్లె పల్లెకు ఆట ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దామరగిద్ద మండలం బాపన్ పల్లి గ్రామంలో ఆదివారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గవినోళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భారత అథ్లెటిక్స్ కోచ్, ద్రోణచార్య అవార్డు గ్రహీత రమేష్ చేతుల మీదుగా యువకులను సన్మానించారు. దేశ సేవ చేయడం ఎంతో గొప్ప విషయం అని యువతను ఆర్మీ దిశగా తీసుకెళ్లిన అకాడమీ డైరెక్టర్లను నిర్వాహకులను అభినందించారు. తెలం గాణ రక్షణ సేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ అకాడమీ ద్వారా ఇప్పటి వరకు సుమారు 100 మంది యువత ఆర్మీలో



చేరడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ఇందుకు కృషి చేసిన మహేష్, ఉద య్ లను ప్రత్యేకంగా అభినందించారు. దామరగిద్ద సర్పంచ్ కనికిరెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, రాఘవేందర్, రెడ్డి దేశాయిపల్లి మాజి సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, నాగేందర్, ప్రభాకర్, కృష్ణ, వెంకట్రాములు, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ లో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

**ముద్ర, కాప్రా:**

ఉప్పల్ నియోజకవర్గంలో రూ.1,511 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రజలే తన రాజకీయ జీవితానికి బలమైన పునాది వేసారని చెప్పారు. కొడంగల్‌లో ఓటమి తర్వాత మల్కాజిగిరి ప్రజలు తనను ఎంపీగా గెలిపించారని, ఉప్పల్ మహిళల మద్దతు తన విజయానికి తోడ్పడిందని గుర్తుచేశారు. మల్కాజిగిరి ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 10 ఎకరాల్లో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కార్యాలయం నిర్మిస్తున్నామని వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు.





మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సేవలను కొనియాడిన సీఎం, ఆయన విగ్రహాన్ని ఉప్పల్‌లో ఏర్పాటు చేయడంతో పాటు ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆయన పేరు పెట్టినట్లు తెలిపారు. మూసీ నది ప్రక్షాళన, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం కొనసాగిస్తోందని, సబర్మతి రివర్ ఫ్రంట్ తరహాలో మూసీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, జిల్లా ఇన్ చార్జి మంత్రి శ్రీధర్ బాబు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో పాటు మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి కళ్యాణంలో జగదీశ్వర్ గౌడ్ దంపతులు

**ముద్ర, శేరిలింగంపల్లి:**

భక్తుల జీవితాల్లో శాంతి, సౌభాగ్యం, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రసాదించే పవిత్ర మహోత్సవం శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణం ఘనంగా జరిగింది. నల్లగండ్ల గ్రామంలోని శ్రీ భ్రమరాంభికా మల్లికార్జున స్వామి కాళ్యాణంలో జగదీశ్వర్ గౌడ్ దంపతులు పాల్గొన్నారు. భ్రమరాంబికా మల్లికార్జున దేవాలయంలో కుటుంబ సమేతంగా స్వామివారి కల్యాణం మరియు జాతర మహోత్సవం పూజా కార్యక్రమంలో పాల్గొని కల్యాణం నిర్వహించారు ఆలయ కమిటీ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్. కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వద్ద ట్రాఫిక్ ఆంక్షలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సోమవారం జరగనున్న చేప ప్రసాదం’ పంపిణీ కార్యక్రమాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నగర ట్రాఫిక్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది ప్రజలు ఈ ప్రసాదం కోసం తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో.. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండేదుకు ముందస్తుగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లుగా పోలీసులు ప్రకటించారు. చేప ప్రసాదం పంపిణీ కారణంగా నేడు ఉదయం 6 గంటల నుంచి మంగళవారం రాత్రి 8 గంటల వరకు నాంపల్లి, ఆ పరిసర ప్రాంతాలలో ఈ ట్రాఫిక్ ఆంక్షలు పూర్తిగా అమల్లో ఉంటాయి. కావున సాధారణ వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు. చేప ప్రసాదం కోసం వివిధ ప్రాంతాల నుంచి సొంత వాహనాల్లో వచ్చే భక్తుల సౌకర్యార్థం పోలీసులు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించారు. కార్లు, భారీ ఫోర్ వాహనాలను గృహకల్ప, గగన్‌విహార్, చంద్రవిహార్ సమీపంలో పార్కింగ్ చేయాల్సి ఉంటుంది. ఇక బస్సులు, వ్యాన్లలో వచ్చే భక్తులు గాంధీభవన్, గృహకల్ప బస్ స్టాప్‌ల వద్ద దిగి, అక్కడి నుంచి కాలినడకన ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు చేరుకోవాలని పోలీసులు స్పష్టం చేశారు. బైకులపై వచ్చే వారి కోసం మనోరంజన్ కాంప్లెక్స్, భీమ్‌రావ్ బాడా ప్రాంగణాల్లో ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు. చివరగా ఆటోల్లో వచ్చే ప్రయాణికుల కోసం షెజాన్ హోటల్ వద్ద ఆటోలో దిగి లోపలికి వెళ్లే ఏర్పాటు చేశారు. చేప ప్రసాదం పంపిణీ సజావుగా సాగేందుకు, ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు భక్తులు, నగర ప్రజలు పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ ఉన్నతాధికారులు సూచించారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలు

**తాండూరు ముద్ర ప్రతినిధి:**

మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని మణికొండ నివాసంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. తాండూరు నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రోహిత్ రెడ్డి కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, అభిమానుల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. తాండూరులో జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు పైలెట్ క్యాంప్ కార్యాలయంలో కూడా జన్మదిన వేడుకలు జరిపారు.

నాయకులు మాట్లాడుతూ తాండూరు అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన రోహిత్ రెడ్డి మరింత ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.


సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
08.06.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**చేపలు తినడం వల్ల కళ్ల ఆరోగ్యానికి మంచిది**

చేపల్లోని పోషకాలు కంటి చూపును మెరుగుపరుస్తాయి. వయసు పెరిగేకొద్దీ వచ్చే కంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.






## దేశ సేవ కోసం యువత ముందుకు రావాలి

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల :**

దేశ సేవ కోసం యువత ముందుకు రావాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల ఎస్కేఎన్ ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో 400మీటర్ల రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం వలన అగ్ని వీర్ నియామకంలో ఎన్నికైన 12 మంది యువకులను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ దేశ సేవ చేయడం అదృష్టం అని, ఉపాధి కోసం కాకుండా దేశ సేవ కోసం ఆర్మీలో చేరడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి వాటి కోసమే 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ను ఏర్పాటు చేయడం జరిగిందని, దీనిని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్మీ కోసం పోటీపడే యువతకు సంఘంలోని పెద్దమనుషులు చేయూతగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, కౌన్సిలర్లు ఏనుగుల లావణ్య రాజు, దయల చంద్రకళ శంకర్, కూతురు శేఖర్, బండ శంకర్, సమిండ్ల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు తోట మల్లికార్జున్ , కుసరి అనిల్ , అకాడమీ నిర్వాహకులు శ్రీకాంత్ రెడ్డి, ఎంపీఓ రవిబాబు, సీనియర్ నాయకులు బాలముకుందం, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గుండా సురేష్ , ప్రధాన కార్యదర్శి సాగి శ్రీధర్ రావు, గౌరవాధ్యక్షులు మూలాసపు రాజన్న, మాజీ సర్పంచ్ రమణ రావు, పురుషోత్తం రెడ్డి, మేనేని శ్రీధర్ రావు, లక్ష్మారెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే..**

జగిత్యాల పట్టణంలోని 39 వ వార్డులు రూ.11.50 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు, 49వ వార్డులో కల్వర్టు, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆదివారం పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, ఇతర అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రయాణం మధ్యలో నిలిచిన ఆర్టీసి బస్సు

- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల :**

నిజామాబాద్ 2 డిపోకు చెందిన టీఎస్ ఆర్టీసీ బస్సు ప్రయాణం మధ్యలో నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. నిజామాబాద్ నుండి హన్మకొండ కు బయలుదేరిన ఈ జేబీఎమ్ ఎలక్ట్రిక్ బస్సు ఆదివారం జగిత్యాల జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు వద్ద ప్రయాణికులను ఎక్కించుకునేందుకు నిలుపగా బస్సు స్టార్ట్ కాకపోవడంతో ప్రయాణికులు దిగిపోయారు. డిపో నుండి వాహనాన్ని బయటకు తీసే ముందు డ్రైవర్ చూసుకోకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేసవి కాలంలో ఎండ వేడి వల్ల మహిళలు ముఖ్యంగా పిల్లలు అసౌకర్యానికి గురయ్యారు. అయితే బ్యాటరీ డిచ్చార్జ్ ఆవడం వలన ఈ ఎలక్ట్రిక్ బస్ స్టాట్ కాలేదని తెలుస్తోంది.

## హిట్లర్‌కు పట్టిన గతే నీకూ పడుతుంది

- సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్ రావు అగ్రహం

**ముద్ర, పెద్దపల్లి :**

హిట్లర్‌ను చూసి హైడ్రా పెట్టానని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డికి హిట్లర్‌కు పట్టిన గతే పడుతుందని మాజీమంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఆదివారం పెద్దపల్లి జిల్లాలో పర్యటించిన హరీశ్‌రావు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలను ఊచకోత కోసిన హిట్లర్ లాగే.. రేవంత్‌రెడ్డి ఉన్నారని ఎద్దేవా చేశారు హిట్లర్‌ను తరిమినట్లే.. ప్రజలు రేవంత్‌రెడ్డిని కూడా తరుముతారని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి పాపాలకు కాంగ్రెస్ మూల్యం చెల్లించుకుంటుందని తెలిపారు. తెలంగాణ ప్రజలకు ఒరిజినల్ కాంగ్రెస్ నేతలు క్షమాపణ చెబుతూనే ఉండాలని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు, భూమికి గౌరవం లేదని చెప్పుకొచ్చారు. రైతులు ఓటేయకపోతే కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# ఏడాదిలోపు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

- నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యం
- రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- గొల్లపల్లి మండలంలో మంత్రి సుడిగాలి పర్యటన



**ముద్ర, గొల్లపల్లి :**

ధర్మపురి నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగునీటిని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఏడాదిలోపు నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరానికి సాగు నీరు అందించడమే ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలో మంత్రి సుడిగాలి పర్యటన చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడంతో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, కల్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. గొల్లపల్లి మండలంలోని చిల్వకోడూరు గ్రామంలో రూ. 7.65 లక్షలతో పెద్ద చెరువు తూము మరమ్మత్తు పనులకు మంత్రి అడ్లూరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ నియోజకవర్గంలో గత ప్రభుత్వ పాలనలో అనేక సాగు నీటి ప్రాజెక్టు పెండింగ్ లో ఉన్నాయని వాటిని పూర్తి చేయకపోవడంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని మంత్రి అన్నారు. నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి రూ. 1,000 కోట్లు అవసరమని, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అంగీకరించినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. నియోజకవర్గంలోని పత్తిపాక రిజర్వాయర్, అక్కపల్లి లిఫ్ట్, మేడారం రిజర్వాయర్ నుండి కొత్తపల్లి వరకు కాలువ పనులతో పాటు మిగిలిన పెండింగ్ ప్రాజెక్టులు ఏడాదిలో పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.

**ముఖ్యమంత్రి సహాయ నిధి, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ..**

గొల్లపల్లి మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంత్రి లక్ష్మణ్ కుమార్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. మండలంలోని 17 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయగా 72 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ. 26 లక్షల 12 వేల విలువైన చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ముఖ్యమంత్రి సహాయ నిధి కొరకు ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

**పోచమ్మ బోనాల్లో పాల్గొన్న మంత్రి..**

గొల్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పోచమ్మ బోనాల కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బైండ్ల పూజారులు మంత్రి గారికి ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మపురి నియోజకవర్గ ప్రజలను ఎల్లవేళలా పోచమ్మ తల్లి చల్లగా చూడాలని ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాపల్లి గంగన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ బీమా సంతోష్ తో పాటు నాయకులు నిశాంత్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు దాసరి తిరుపతి గౌడ్ తో పాటు మండలంలోని కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## మునిలత కుటుంబానికి అండగా మంత్రి అడ్లూరి

- కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తానని హామీ..
- మునిలత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి..

**ముద్ర, ఎండపల్లి :**

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన మునిలత కుటుంబానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అండగా నిలిచారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం చెర్లపల్లి గ్రామానికి చెందిన మునిలత ఇటీవల రాజారాం పల్లి లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. మిథురాలు మృతురాలు కుటుంబ సభ్యలను ఆదివారం చర్లపల్లి లో పరామర్శించిన మంత్రి అడ్లూరి మునిలత కుటుంబ సభ్యులను ఓదార్చారు. రూ.10వేల ఆర్థిక సహాయం అందించిన మంత్రి అడ్లూరి మునిలత కుటుంబ సభ్యులకు ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

# నాణ్యమైన పోషకాహారం అందించాలి

- జిల్లా ఆహార భద్రత అధికారి సునీత

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**




జిల్లాలోని అంగన్వాడీల్లో పోషకాహారాన్ని సరిగా అందించాలని జిల్లా ఆహార భద్రత అధికారి సునీత అన్నారు. "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక", ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం నేపథ్యంలో సందర్భంగా అంగన్వాడీ ఉపాధ్యాయులకు ఆహార భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఆహార భద్రతాధికారి సునీత మాట్లాడుతూ సమాజంలో చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర అత్యంత కీలకమైనదన్నారు. ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ ఉపాధ్యాయులకు ఆహార నాణ్యత, భద్రతా ప్రమాణాలపై పూర్తి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వివరించారు. అంగన్వాడీ కేంద్రాలలో సరఫరా చేసే ఆహార పదార్థాల నిల్వ, వంట తయారీ విధానాలలో పరిశుభ్రత పాటించాలని స్పష్టం చేశారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యాలను సాధించడంలో భాగంగా, జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలో నాణ్యమైన ఆహార నియమాలు అమలయ్యేలా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు.భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని అవగాహన కార్యక్రమాల ద్వారా జిల్లాను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దుతామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, అంగన్వాడి టీచర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పెద్దమ్మ తల్లికి బోనాలు



**ముద్ర, కోరుట్ల;**

కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో ఆదివారం రోజున ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆలయ ప్రత్యేక ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు. సాయంత్రం ఇంటికొక్క బోనం చొప్పున మహిళలు నెత్తిమీద బొనమెత్తుకుని డప్పు చప్పుళ్ళ మధ్య, ద్యావత్ పూజారుల విన్యాసాలతో ఊరేగింపుగా పెద్దమ్మ తల్లి గుడికి తరలివెళ్లారు. పెద్దమ్మ తల్లి కి బోనాలు సమర్పించుకున్నారు. పెద్దమ్మ తల్లి దీవెనలు అందరిపై ఉండాలని. ప్రజలంతా సుభిక్షంగా వుండి పాడిపంటలతో, సుఖసంతోషాలతో ఉండాలన్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సర్పచ్, ఉప సర్పంచ్, ముదిరాజ్ సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు

## జువ్వాడి నర్సింగరావు దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు

- కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న కాంగ్రెస్ నేతలు

**ముద్ర, కోరుట్ల :**

కోరుట్ల పట్టణ జువ్వాడి భవన్లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు రజనీ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు విచ్చేసి కేక్ కట్ చేసి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం పలువురు నేతలు మాట్లాడుతూ జువ్వాడి నర్సింగరావు ఇలాంటి వివాహ వార్షికోత్సవ వేడుకలు మరెన్నో జరుపుకోవాలని రాబోయే కాలంలో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, నాయకులు పుప్పాల ప్రభాకర్, రిజ్వాన్, ఆర్ భూమయ్య, ఏతిరాజం నర్సయ్య, నేతి శ్రీనివాస్, ఎంబేరి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేస్తాం

- కవితమ్మ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్ర ప్రజలకు ఉచితంగానే విద్య, వైద్యం
- రైతు కష్టాలు లేని తెలంగాణే టిఆర్ఎస్ లక్ష్యం
- పాంచజన్యాలను ప్రజల్లోకి తిసుకుపోతాం




**ముద్ర, కరీంనగర్ :**

తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా ఈరోజు చొప్పదండి నియోజకవర్గ కేంద్రంలో ఘనంగా టిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. టిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ మ్యాకల తిరుపతి ఆధ్వర్యంలో ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది ఉద్యమకారులు తెలంగాణ కోసం జరిగిన పోరాటంలో భాగస్వామ్యం అయ్యారు. కానీ రాష్ట్ర ఎర్పడిన తరువాత ప్రజలు ఆశించిన స్థాయిలో బిఆర్ఎస్ ప్రభుత్వం పనిచెయ్యలేదు కనుకనే కేసిఆర్ ను ఇంటికి పంపించారు. తరువాత వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు నాలుగు వందల ఇరవై హామిలి ఇచ్చి అధికారంలోకి వచ్చారు కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడ ఇచ్చిన హామీలను అమలు చెయ్యకుండా కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం మాదిరిగా భూములను అమ్మడం లేదా చౌకగా వారి అనుచరులకు అప్ప చెప్పటమే తప్ప వారికి ప్రజా సంక్షేమం మీద ధ్యాస లేదని గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. ఈ రాష్ట్రంలో ప్రజల సమస్యల మీద కేవలం తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితమ్మ మాత్రమే పోరాటం చేస్తుందని వారు అన్నారు. కవితమ్మ నాయకత్వంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు ఒక్కతే ఈ ప్రభుత్వ అవినీతి ప్రశ్నిస్తుందని రానున్న రోజులలో తెలంగాణకు కవితమ్మ నాయకత్వం అవసరం కవితమ్మ ప్రవేశ పెట్టిన పాంచజన్యం ఈదేశ రాజకీయాలలో ఒక విప్లవాత్మక నిర్ణయం ఈ దేశంలో ఇప్పటికీ కవితమ్మ చెప్పిన పంచ సూత్రాలను ప్రవేశ పెట్టిన నాయకుడేలేరు అందుకే రాష్ట్ర ప్రజానీకం కవితమ్మ వైపు చూస్తుంది ముఖ్యంగా మహిళలు, యువకులు, రైతులు తెలంగాణ ఉద్యమకారుల, బడుగు బలహీన వర్గాలు ఈరోజు కవితమ్మ అడుగులో అడుగేసి ముందుకు నడవడం కోసం చూస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక చొప్పదండి నియోజకవర్గం నాయకులు గుండేటి తిరుపతి, పిట్టల సత్యం, యండి బషిర్, జిల్లా బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, అధివాసి జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు మల్లారెడ్డి, చంటి శ్రీనివాస్, సిపెల్లి వెంకటేష్, గాలిపెల్లి రత్నాకరచారి, లింగంపల్లి శ్రీనివాస్, కొత్తపల్లి తిరుపతి యండి రాజీ, పుసాల పవన్, యండి బషీర్, కైఫ్, నునే చరణ్, పల్లె శారద, అంజలి, అపర్ణ, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 08.06.2026
www.mudranews.in | @mudranews



## చేపలు తినడం వల్ల ప్రోటీన్ సమృద్ధిగా లభిస్తుంది

చేపలు అధిక నాణ్యత గల ప్రోటీన్‌కు మంచి మూలం. కండరాల నిర్మాణం, శరీర ఎదుగుదలకు తోడ్పడతాయి.



# శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**ముద్ర, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఆదివారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దర్శించుకున్నారు. కేంద్రమంత్రికి దేవస్థాన కార్యనిర్వణాధికారి భవానీ శంకర్, ఆలయ అర్చకులు. ఆలయ సాంప్రదాయ స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారి ఉదయం పూజలో అభిషేక సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం కేంద్రమంత్రికి ప్రసాదం, శ్రీ స్వామి వారి మోమెంటోను కార్య కార్యనిర్వహణాధికారి అందజేశారు.





# మానసిక ప్రశాంతతకు యోగ

**- మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** శారీరక దృఢత్వానికి, మానసిక ప్రశాంతతకు యోగ అద్భుతమైన మార్గమని మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో ఆదివారం భువనగిరి పురపాలక సంఘం ఆధ్వర్యంలో హ్యాపీ సండే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో యోగ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ హాజరై యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగ చేయడం వలన మానసిక ప్రశాంతత, ఒత్తిడి, ఆందోళనలను తగ్గించి మనసుకు మనశ్శాంతిని ఇస్తుందన్నారు. శారీరక దృఢత్వం కండరాలు బలపడి శరీరంలో వశ్యత సమతుల్యత మెరుగుపడతాయన్నారు. గుండె ఆరోగ్యం రక్తపోటును అదుపులో ఉంచి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు ఏలే భువనేశ్వరి శివ కుమార్, నాకోటి నగేష్ మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# అమెరికాలో తెలుగు భాష సేవలు



**- ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భువనగిరి పట్టణ కమిటీ చైర్మన్ వెల్లంకి పురుషోత్తం రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భువనగిరి పట్టణ కమిటీ చైర్మన్ వెల్లంకి పురుషోత్తం రెడ్డి అమెరికాలో గత నాలుగు నెలలుగా విశేష విద్యా, సామాజిక సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్ జిల్లా పరిధిలోని మెలిస్సా గ్రామంలో నివసిస్తున్న తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన ప్రవాస భారతీయ విద్యార్థులకు "మనబడి" కార్యక్రమం ద్వారా తెలుగు భాషను బోధించిన్నట్లు తెలిపారు.

విద్యార్థులు తాము ఏ దేశంలో ఉన్నప్పటికీ తమ మాతృభాష అయిన తెలుగును మరువకూడదని పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ మాతృభాషకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ, దైనందిన జీవితంలో తెలుగులోనే మాట్లాడాలని కోరారు. తెలుగు అత్యంత తీపి భాష అని, ఇందులో నైపుణ్యం సాధించడం మన బాధ్యత అని అన్నారు. మాతృభాష ద్వారానే మన సాహిత్యాన్ని, సంస్కృతిని, సాంప్రదాయాలను కాపాడుకోగలమని.. మాతృభాషను మరచిపోయిన వాడు తన ఉనికిని, సంస్కృతిని కోల్పోతాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### ఎన్నారైల ఘన సన్మానం

గత నాలుగు నెలలుగా అమెరికాలో పురుషోత్తం రెడ్డి నిరంతరాయంగా అందించిన విద్యా సేవలను గుర్తిస్తూ స్థానిక ప్రవాస భారతీయులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్నారైలు మాట్లాడుతూ.. పురుషోత్తం రెడ్డి ఎల్లప్పుడూ సమాజ సేవలో, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో ముందుంటారని కొనియాడారు. మానవతా దృక్పథంతో ఆయన చేసిన సేవలు అభినందనీయమన్నారు. అమెరికాలో ఉన్న తెలుగు పిల్లలకు ఆయన అందించిన విద్యా సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తును ఉజ్వలంగా మార్చుకోవాలని ఆకాంక్షించారు.

# దార్శనిక దేవాలయాలు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు





**- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** రాష్ట్రంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు కేవలం భవనాలు కాకుండా భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే దార్శనిక దేవాలయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం లక్ష్మీపురంలోని పాఠశాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి, నాణ్యతతో పాటు గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. విద్యపై ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి భవిష్యత్ తరాల అభివృద్ధికి పెట్టుబడిగా భావించాలని ఆయన పేర్కొన్నారు.

### అభివృద్ధి పనులు నాణ్యతతో, గడువులోగా పూర్తి చేయాలి

మధిర నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ముదిగొండ మండలంలో రూ.3.15 కోట్లతో 33/11 కేవీ సబ్‌స్టేషన్, రూ.25 లక్షలతో ఈఆర్‌వో కార్యాలయం, రూ.33 కోట్ల రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి, నిర్మాణంలో ఉన్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందేలా పనులను వేగవంతం చేయాలని సూచించారు.


ఈ కార్యక్రమాల్లో ఎన్ పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా ఛైర్మెన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### కనురెప్ప కాలం కూడా కరెంట్ పోని తెలంగాణ

ఖమ్మం పాకబండ బజార్‌లో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినా ఎక్కడా కోతలు లేకుండా నిరంతరాయంగా సరఫరా చేస్తున్నామని తెలిపారు. 2023లో 15,000 మెగావాట్లుగా ఉన్న గరిష్ట విద్యుత్ డిమాండ్ ప్రస్తుతం 18,548 మెగావాట్లకు చేరిందని చెప్పారు. భవిష్యత్తులో మూసీ అభివృద్ధి, ఫ్యూచర్ సిటీ, ఫార్మా సిటీ, డేటా సెంటర్లు, ఐటీ రంగ విస్తరణతో విద్యుత్ అవసరాలు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా 2030 నాటికి 20,000 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. రాష్ట్రంలోని 85 గ్రామాలను సంపూర్ణ సౌర విద్యుత్ గ్రామాలుగా అభివృద్ధి చేయడంతో పాటు, రెండు మండలాల్లో వ్యవ సాయ పంపుసెట్లకు 100 శాతం సోలరైజేషన్ చేపడుతున్నట్లు వెల్లడించారు. 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకం ద్వారా 6 లక్షల ఎకరాలకు సౌర విద్యుత్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం ప్రతి సంవత్సరం 13.5 శాతం వృద్ధి రేటు సాధించాల్సి ఉంటుందని భట్టి పేర్కొన్నారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం ఏటా సుమారు ₹14,000 కోట్లు వెచ్చిస్తోందన్నారు. రైతులకు ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, విద్యుత్ మీటర్లపై జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఆయన విమర్శించారు

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**- ప్రభుత్వ పాఠశాలకు పెయింటింగ్ సాయం**





**ముద్ర, తుర్కపల్లి:** మండలంలోని దత్తాయపల్లి ప్రభుత్వ పాఠశాలలో 2004–05 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 21 ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ పరస్పరం యోగక్షేమాలు తెలుసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు చదువుకున్న ప్రభుత్వ పాఠశాలకు తమ వంతు సహాయంగా సొంత ఖర్చుతో తరగతి గదులకు పెయింటింగ్ వేయించారు. భవిష్యత్తులో కూడా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా ఉంటామని తెలిపారు. అనంతరం అందరూ కలిసి భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కే చంద్రశేఖర్, విజయ్, పాండు, సిద్దులు, కల్పన, సుమలత, జ్యోతి, విశాల, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

# పోచంపల్లి చేనేత వస్త్ర కళకు ప్రత్యేక గుర్తింపు ఉంది

**- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** హైటెక్స్ లో ఏర్పాటు చేసిన ట్రెడ్ పోచంపల్లి చేనేత వస్త్ర ప్రదర్శనకు చివరి రోజు ఆదివారం భారీగా సందర్శకులు వచ్చారు. ముగింపు కార్యక్రమానికి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు చేతుల మీదుగా ఎగ్జిబిషన్ లో స్టాల్స్ ఏర్పాటు చేసిన వారికి సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పోచంపల్లి చేనేత వస్త్ర కళకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ట్రెడ్ పోచంపల్లి హైటెక్స్‌లో నిర్వహించిన చేనేత వస్త్ర ప్రదర్శనకు మూడు రోజుల పాటు సందర్శకులు భారీగా తరలివచ్చారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు ప్రదర్శనలో ఉంచిన చేనేత వస్త్రాలు, పోచంపల్లి ప్రత్యేక ఉత్పత్తులు, చేతి వృత్తిదారుల కళాఖండాలను ఆసక్తిగా వీక్షించి కొనుగోలు చేశారు.

ప్రదర్శనలో మహిళలు, యువత, ఉద్యోగులు, చేనేత అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోచంపల్లి చేనేతకు ఉన్న ప్రత్యేకతను ప్రతిబింబించే చీరలు, డ్రెస్ మెటీరియల్స్, హోమ్ ఫర్నిషింగ్ ఉత్పత్తులు, సంప్రదాయ హస్తకళ వస్తువులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నాణ్యమైన ఉత్పత్తులు ఒకే వేదికపై అందుబాటులో ఉండటంతో కొనుగోలుదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా పలువురు సందర్శకులు మాట్లాడుతూ, చేనేత ఉత్పత్తులను నేరుగా తయారీదారుల నుండి కొనుగోలు చేసే అవకాశం లభించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా చేనేత కార్మికులకు ప్రోత్సాహం లభించడంతో పాటు వారి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు.

మూడు రోజుల పాటు విజయవంతంగా సాగిన ఈ చేనేత వస్త్ర ప్రదర్శనకు ప్రజల నుండి విశేష స్పందన లభించిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రదర్శనలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సందర్శకులు నిర్వాహకులను కోరారు. చేనేత రంగాభివృద్ధికి ఈ తరహా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, ఏడి జౌళి చేనేత అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## పార్టీ కమిటీల్లో ఎస్సీలకు సముచిత స్థానం

**- బండి రమేష్**

**ముద్ర కూకట్ పల్లి:** పార్టీ కమిటీల ఏర్పాటులో ఎస్సీలకు సముచిత న్యాయం, ఉన్నత స్థానం కల్పించడం జరుగుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చెన్నయ్య ఆధ్వర్యంలో ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గ కార్యాలయం 'హేమ దుర్గా భవన్'లో ఎస్సీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా, నియోజకవర్గ, డివిజన్ కమిటీల నియామకంపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కమిటీల ఏర్పాటు పాత, కొత్తల మేలు కలయికగా ఉంటుందని, దీని ద్వారా పార్టీలో అందరికీ తగిన గౌరవం, గుర్తింపు దక్కుతాయని స్పష్టం చేశారు. ఇప్పటికే అగ్రికల్చర్ మార్కెట్ కమిటీల్లో, ఇందిరమ్మ ఇళ్ల కమిటీల్లో ఎస్సీ సోదరులను గుర్తించి తగిన పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మయ్య, కరక పెంటయ్య, బాల నరసింహ, రమేష్, కృష్ణ, రాము, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

**ముద్ర, భూపాలపల్లి:** భూపాల్‌పల్లి జిల్లా కాశీంపల్లిలో నిషేధిత అంబర్ పాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు, సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు నిర్వహించిన తనిఖీలలో భాగంగా భూపాలపల్లి మండలం ఖాసింపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ యూసుఫ్ (36) వద్ద అంబర్ (అనార్ బ్రాండ్) గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. 6 సంచుల్లో, ఒక్కో సంచిలో 200 ప్యాకెట్ల చొప్పున మొత్తం 1,200 ప్యాకెట్లు లభించగా, వాటి విలువ సుమారు రూ.1,92,000/–గాపేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అభిప్రాయం పొందిన అనంతరం, నిందితుడిని స్వాధీనం గుట్కా ప్యాకెట్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

**చేపలు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది**

విటమిన్ D, సెలీనియం వంటి పోషకాలు శరీర రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తాయి. ఇన్ఫెక్షన్లను ఎదుర్కొనే శక్తిని పెంచుతాయి.





## 14న నవల " లంద " ఆవిష్కరణ

- హైదరాబాద్ రవీంద్రభారతిలో సభ
- హాజరుకానున్న పలువురు సాహితీ ప్రముఖులు

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

సిద్ధిపేట జిల్లా కు చెందిన ప్రముఖ కవి, రచయిత పొన్నాల బాలయ్య రచించిన " లంద " నవల ఆవిష్కరణ సభ హైదరాబాద్ లో జరుగుతుందని మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆదివారం సిద్ధిపేట ప్రెస్ క్లబ్ లో కార్యక్రమ ఆహ్వాన పత్రికను మరసం ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14 ఆదివారం హైదరాబాద్ లో "లంద " నవల ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు. రవీంద్రభారతి మినీ హాల్ లో మధ్యాహ్నం 1:30 గంటలకు సభ ప్రారంభం అవుతుందని తెలిపారు. ఆవిష్కరణ సభకు ముఖ్యఅతిధి గా ప్రఖ్యాత కవి, రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ నందిని సిధారెడ్డి హాజరవుతారని విశిష్ఠ అతిధిగా శాసన మండలి సభ్యులు, ప్రముఖ కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్, లంద నవల పుస్తక ఆవిష్కర్త గా ఉస్మానియా యునివర్సిటీ ఆర్ట్ కళాశాల ప్రిన్సిపల్, ప్రముఖ కవి, రచయిత ప్రొఫెసర్ కాశీం, ప్రధాన వక్తగా ప్రముఖ రచయిత విమర్శకులు జి.లక్ష్మీ నరసయ్య, ఆత్మీయ అతిధులుగా ప్రముఖ రచయిత్రి జూపాక సుభద్ర, ప్రముఖ కవి రచయిత,కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పసునూరి రవీందర్, పర్స్పెక్టివ్ ఆర్. కె. ప్రముఖ కవి, రచయిత తైదల అంజయ్య, ప్రముఖ కవి, రచయిత సుద్దెంకి యాదగిరి, కవి రచయిత బెల్లంకొండ సంపత్ కుమార్ తదితరులు హాజరవుతారని తెలిపారు.. తెలంగాణ ప్రాంతంలోని గ్రామాల్లో మాదిగ సామాజిక వర్గాల జీవితం ప్రధాన అంశం గా రచయిత పొన్నాల బాలయ్య "లంద " నవల రచించాడని తెలిపారు.. తెలుగు సాహిత్య ప్రపంచం లో లంద నవల తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంటుందని తెలిపారు. ఈ నవల ఆవిష్కరణ సభ కు సిద్ధిపేట జిల్లా నుండి, ఉమ్మడి మెదక్ జిల్లా నుండి పెద్దఎత్తున సాహితీ ప్రియులు హాజరు కావాలని మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు.

## తెల్లాపూర్ శాసనానికి కట్టేసి రాళ్లతో కొట్టండి

- ఉచిత విద్య, వైద్యం ఇవ్వకపోతే ఏ శిక్షకైనా సిద్ధం
- బీజేపీని ప్రశ్నించాల్సిన మిగతా పార్టీలు ఎందుకు సైలెంట్ అయ్యాయి
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

**ముద్ర, సంగారెడ్డి, పటాన్ చెరు :**

సంగారెడ్డి, పటాన్‌చెరు ప్రాంతాల్లో మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు నడుస్తున్నాయని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తెలంగాణ రక్షణ సేన జెండా పండుగలో భాగంగా నిర్వహించిన సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ, అన్ని పార్టీల నేతలు ప్రజా సమస్యలను విస్మరించి పరస్పరం సహకరిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం అందిస్తామని, అమలు చేయకపోతే తనను శిక్షించవచ్చని కవిత సవాల్ విసిరారు. జహీరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్, పటాన్‌చెరుకు ఎంఎంటీఎస్ వంటి కీలక అంశాలపై ఇతర పార్టీలు ఎందుకు మౌనం వహిస్తున్నాయని ప్రశ్నించారు. సింగూర్ ప్రాజెక్టు నిర్లక్ష్యం, భూకబ్జాలు, అవినీతి, కాలుష్య సమస్యలపై ప్రభుత్వాలను నిలదీశారు. యువతకు ఉద్యోగాలు, వ్యాపార రుణాలు, రైతులకు గౌరవప్రదమైన పాలన, సామాజిక న్యాయం తమ పార్టీ లక్ష్యాలని తెలిపారు. పటాన్‌చెరు పరిశ్రమలను కొనసాగిస్తూ కాలుష్య నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కవిత పేర్కొన్నారు.

## టీజీపీఎల్లో సిద్దిపేట క్రీడాకారులకు జాక్ పాట్

- 11లక్షలకు అర్ఫాజ్ ను దక్కించుకున్న నల్గొండ నైట్స్ టీం
- 2.3 లక్షలకు అఫ్రిదిని దక్కించుకున్న మహబూబ్ నగర్ జిల్లా




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

తెలంగాణ ప్రీమియర్ లీగ్ (టీజీపీఎల్)లో సిద్ధిపేట క్రికెటర్లు ఆర్ఫాజ్, అఫ్రీదిలు జాక్ పాట్ కొట్టారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీజీపీల్ లో తెలంగాణ రాష్ట్రం లోని జిల్లాల నుండి 6000 మంది క్రికెటర్లను సెలక్ట్ చేశారు. అందులో నుండి 3000 మందిని, తిరిగి 400 మందిని సెలెక్ట్ చేసిన సభ్యులు అందులో నుండి 160 మంది క్రికెటర్లను బిడ్డింగ్ నిర్వహించగా 8 టీం లు కొనుగోలు చేశాయి. సిద్ధిపేట కు చెందిన అన్న తమ్ముళ్లు అఫ్రీది 2.30 లక్షలకు మహబూబ్ నగర్ జిల్లా పాలమూరు స్ట్రైకర్స్ , నల్గొండ నైట్స్ ఆర్ఫాజ్ రూ. 11 లక్షలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు క్రీడాకారులను పలువురు అభినందనలు తెలిపారు.

## 3,75,471 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



మెదక్ జిల్లా వ్యాప్తంగా 81,266 మంది రైతుల నుంచి 3,75,471 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. 62,363 మంది రైతులకు 664,67 కోట్ల రూపాయలు చెల్లింపులు పూర్తి చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా 260 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేసినట్లు పేర్కొన్నారు. ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

# ఆర్మీ సుబేదార్ దారుణ హత్య

- ఇంట్లోనే కొట్టి చంపిన భార్య, బామ్మర్ది, అత్తా, మామ
- అక్రమ సంబంధాల నేపథ్యంలో హత్య చేసినట్టు అనుమానాలు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణం బృందావన్ కాలనీలో ఆర్మీ సుబేదార్ పొన్నం కుమార్ గౌడ్ (49) శనివారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్ గౌడ్ కథనం ప్రకారం... మెదక్ మండలం ర్యాలమడుగు గ్రామానికి చెందిన పొన్నం కుమార్ గౌడ్ ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఆర్మీ సుబేదార్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. మే 11వ తేదీన అతను సెలవులపై ఇంటికి వచ్చాడు. ఈ నెల 10వ తేదీన సెలవులు ముగించుకొని తిరిగి విధుల్లో చేరాల్సి ఉంది. కుమార్ గౌడ్, పద్మ దంపతుల మధ్య సంసారం విషయంలో తరచూ గొడవలు జరిగేవి. ఇతర మహిళలతో అక్రమ సంబంధాలూ ఉన్నాయనే విషయంలో పలుమార్లు పెద్దల మధ్య పంచాయతీ జరిగినా కుమార్ గౌడ్ తీరు మారలేదు. సెలవులపై ఇంటికి వచ్చిన ప్రతిసారి కుమార్ భార్య పద్మతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి కూడా భార్య భర్తల మధ్య గొడవ జరుగగా, భార్య పద్మ, బావమరిది సంతోష్, అత్తా, మామ ఎల్లమ్మ, రామకృష్ణ గౌడ్ మరి కొందరు కలిసి కుమార్ గౌడ్ ను కర్రలు, రాళ్లతో తీవ్రంగా కొట్టడంతో అతను తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. కుమార్ గౌడ్ కు పలువురు మహిళలతో అక్రమ సంబంధాలున్నాయని, అతని హత్యకు అదే కారణమన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గత పదిహేను రోజుల క్రితం భార్య పద్మా కుమార్ గౌడ్ తో గొడవ పడి కొల్చారం మండలం వరిగుంతం గ్రామానికి వెళ్ళినట్టు తెలిసింది. ఈ క్రమంలో శనివారం రాత్రి కుమార్ గౌడ్ ఇద్దరు మహిళలను ఇంటికి తీసుకొచ్చినట్టు సీసీ కెమెరాలో చూసి వరిగుంతం నుండి భార్య పద్మ, బావమరిది సంతోష్, అత్త మామలు మెదక్ పట్టణనం బృందావన్ కాలనికి వచ్చి కుమార్ గౌడ్ ను తిట్టడంతో పాటు కర్రలు, రాళ్లతో అతనిపై దాడి చేసి తీవ్రంగా కొట్టడంతో ప్రాణాలు కోల్పోయిన ట్టు తెలిసింది. మృతుడి అన్న రవీందర్ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్ తెలిపారు. వివాహేతర సంబంధాల నేపథ్యంలో హత్య జరిగినట్టు అనుమానాలు వ్యక్తం కాగా, నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ఆ కోణంలో విచారణ చేస్తున్నట్టు తెలిపారు. మృతునికి ఇద్దరు కూతుళ్లు శ్రావణి జాన్సీ ఉన్నారు.



# లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



జాతీయ లోక్ అదాలత్ ఈనెల 20న నిర్వహిస్తున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు సూచించారు. సత్వర న్యాయ పరిష్కారానికి లోక్ అదాలత్ ఉత్తమ వేదిక అన్నారు. ప్రజలకు తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో న్యాయం అందించేందుకు నిర్వహించబడుతున్న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. వివిధ రకాల పెండింగ్ కేసులు, ట్రాఫిక్ చలానాలు, రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులు, కుటుంబ వివాదాలు, సివిల్ వివాదాలు తదితర అంశాలను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కారమైతే దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియ నుంచి ఉపశమనం లభించడంతో పాటు సమయం, ధనం ఆదా అవుతాయని పేర్కొన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివాదాలను సామరస్యపూర్వకంగా ముగించేందుకు ఇది మంచి అవకాశమని తెలిపారు. ప్రజలు తమ కేసులకు సంబంధించిన వివరాలను సంబంధిత కోర్టులు, న్యాయవాదులు లేదా పోలీసు అధికారులను సంప్రదించి లోక్ అదాలత్‌లో పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పరస్పర అవగాహనతో తమ వివాదాలను ముగించుకోవాలని కోరారు.

## సైబర్ మోసం..

### రూ.95 వేలు పోగొట్టుకున్న యువకుడు

**ముద్ర, బీర్కూర్**



బీర్కూర్‌లో సైబర్ మోసం.. రూ.95 వేలు పోగొట్టుకున్న యువకుడు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి బీర్కూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు రూ.95వేలు పోగొట్టుకున్నాడు. బీర్కూర్ గ్రామానికి చెందిన మజార్ అనే యువకుడు బీర్కూర్ లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. వివరాల్లోకి వెళితే.. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి బీర్కూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు రూ.95వేలు పోగొట్టుకున్నాడు. బీర్కూర్ గ్రామానికి చెందిన మజార్ అనే యువకుడు బీర్కూర్ లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మే నెల 2న వాట్సాప్ గ్రూపులో ఆర్టీవో చలాన్ లింక్ వచ్చింది. యువకుడు ఆ లింక్ ని ఓపెన్ చేసి లింక్ అడిగిన వివరాలను నమోదు చేశాడు. జూన్ 3న తన ఖాతాలో రూ. లక్ష నగదును జమ చేశాడు. జూన్ 6న సాయంత్రం యువకుడి ఖాతాలో నుండి ఆరు దఫాలుగా మొత్తం రూ.95 వేల నగదును సైబర్ నేరగాళ్లు కాజేశారు. నగదు పోయిన వివరాలు మెసేజ్ రావడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బీర్కూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి, 1930కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కష్టపడే తత్వమే ఉన్నత శిఖరాలకు చేర్చింది

- రామోజీ రమేష్ కు శుభాకాంక్షలు తెలియజేసిన తోడేటి

**ముద్ర, ఖమ్మం :**



ఇంటిలిజెన్సీ అడిషనల్ ఎస్పీ గా విధులు నిర్వహిస్తున్న రామోజి రమేష్ ఎస్పీ గా ఉద్యోగ ఉన్నతి పొందినందుకు టిఆర్ఎస్ పార్టీ నాయకులు తోడేటి లింగరాజు యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం లింగరాజు యాదవ్ రామోజీ రమేష్ ను కలిశారు. పోలీస్ డిపార్ట్మెంట్లో అంచలంచలుగా ఎదిగి ఉన్నత స్థాయికి చేరినందుకు చాలా గర్వంగా ఉందని కొనియాడారు. డిపార్ట్మెంట్లో అందర్నీ కలుపుకొని పోయే మనస్తత్వం రామోజీకి ఉందని, అంత మాత్రమే కాకుండా తన వీధి నిర్వహణలో ప్రజల మన్ననలు పొందుకున్నారని అన్నారు. తను ఎక్కడ నిధులు నిర్వహించిన అక్కడి ప్రజలతో పాటు తోటి సిబ్బందితో కలగలుపుగా పనిచేస్తారని, ఈ క్రమశిక్షణ రామోజీని ఉన్నత స్థాయికి చేర్చిందని తోడేటి లింగరాజు యాదవ్ తెలిపారు. రామోజీ రమేష్ ఎస్పీగా ప్రమోషన్ పొందడం అభినందనీయమని అన్నారు. రానున్న రోజుల్లో ఇంకా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని లింగరాజు యాదవ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జి. రాజా, వెలిశాల వేరేంద్ర, దేవి నాగేశ్వరరావు, బలగని శ్రీనివాస్ తదితరులు అభినదనలు తెలియజేశారు.

### నిజాంసాగర్

## జలాశయం నీటి విడుదల



**ముద్ర, నిజాంసాగర్ :**

నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంతోపాటు పరిసర గ్రామాలకు తాగునీటి కోసం నిజాంసాగర్ జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్నామని ప్రాజెక్టు ఏఈఈ సాకేత్ తెలిపారు. ఆదివారం కామరెడ్డి జిల్లా నిజాంసాగర్ జలాశయం జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం వద్ద నీటిపారుదల శాఖ ప్రధాన గేట్ల నుంచి 1000 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి విడుదల చేశారు. ప్రధాన కాలువ నిండుగా ప్రవహిస్తుండటంతో సమీప గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు నీటిలోకి దిగవద్దని సూచించారు. దీంతోపాటు వ్యవసాయ పనులకు నీటిని వినియోగించవద్దన్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1395 అడుగులు (7.200 టీఎంసీలు) నీటి నిల్వ ఉందని పేర్కొన్నారు.

### దామరంచలో

## అక్రమంగా ఇసుక రవాణా

**ముద్ర, బీర్కూర్ :**

దామరంచ గ్రామంలో గత నెల రోజులుగా అక్రమంగా ఇసుక రవాణా కొనసాగుతోంది. అదే గ్రామానికి చెందిన అధికార, ప్రతిపక్షం నాయకులు ఇసుక అక్రమ దందాకు తెరలేపారు. ఇసుక రవాణాకు ఏకంగా మంజీరా నదిలో బాట వేసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా కొంత మంది పగటిపూట ట్రాక్టర్ల ద్వారా మంజీరా నదిలో ఇసుక నింపుకుని గ్రామ శివారులో అక్రమంగా డంపులు చేస్తున్నారు. చీకటి పడగానే జేసీబీ ద్వారా అక్రమంగా నిల్వ ఉన్న ఇసుకను టిప్పర్లు, లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మరికొంత మంది ఎలాంటి అనుమతులు పొందకుండా మంజీరా నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా బాన్సువాడ, నస్రుల్లాబాద్, దుర్కి తదితర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. గత నెల 11న దామరంచ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని జప్తు చేసి కేసు నమోదు చేశారు. దీంతో అక్రమ రవాణా కొద్ది రోజులు నిలిపివేశారు. 15 రోజుల నుంచి మళ్లీ ఈ దందా మొదలు పెట్టారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారు జామున ఎలాంటి అనుమతులు లేకుండా మంజీరా నది నుంచి ఇసుక తరలిస్తుండగా జీపీవో, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 08.06.2026
www.mudranews.in | @mudranews



## చేపలు తినడం వల్ల ..

ఎముకలు దృఢంగా ఉంటాయిచేపల్లో ఉండే విటమిన్ D, కాల్షియం ఎముకల బలానికి సహాయపడతాయి. ఎముకల బలహీనతను తగ్గిస్తాయి.




# మానవ్ సుతార్

## టీమ్ ఇండియా స్పిన్ కు సరికొత్త అవతార్



**ముద్ర స్పోర్ట్స్ డెస్క్:**
అప్పుడప్పుడు రవిచంద్రన్ అశ్విన్ ఇలాంటి బౌలింగ్ వేసేవాడు. రవీంద్ర జడేజా ఈ స్థాయిలో గణాంకాలు నమోదు చేసేవాడు. కులదీప్ యాదవ్ ఇప్పుడు ఒకసారి ఇలాంటి మ్యాజిక్ ప్రదర్శించేవాడు. కానీ ఇన్ని రోజులకు.. టీమిండియా స్పిన్ బౌలింగ్ ఎలా ఉంటుందో ఈ 23 సంవత్సరాల యువకుడు చూపించాడు. మైదానం నుంచి సపోర్ట్ లేకపోయినప్పటికీ..పిచ్ లో జీవం కనిపించకపోయినప్పటికీ.. బంతిని గింగిరాలు తిప్పిన తీరు అద్భుతం.. అనన్య సామాన్యం. ఇతడిని గనక సాన పెడితే ఖచ్చితంగా మరో రవిచంద్రన్ అశ్విన్ అవుతాడు. అందులో ఏమాత్రం అనుమానం లేదు.ఆఫ్ఘనిస్తాన్ జట్టుతో జరుగుతున్న ఏకైక టెస్టులో టీమిండియా సంపూర్ణ ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. రెండవ రోజు టీమిండియా దూకుడుగా బ్యాటింగ్ చేసింది. కెప్టెన్ గిల్ 126, రిషబ్ పంత్ 81, వాషింగ్టన్ సుందర్ 52 పరుగులు చేసి సత్తా చాటడంతో టీమిండియా భారీ స్కోర్ చేసింది. 8 వికెట్ల నష్టానికి 564 పరుగులకు ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్ మొదలు పెట్టిన ఆఫ్ఘనిస్తాన్ భారత బౌలర్ల ముందు తలవంచింది.. రెండవ రోజు ఆట ముగిసే సమయానికి ఐదు వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. టీమిండియా బోర్డర్లలో సుతార్ మూడు వికెట్లు పడగొట్టాడు. 16 ఓవర్ల పాటు బౌలింగ్ వేసిన అతడు.. అందులో 7 ఓవర్లను మెయిడ్ ఇన్ గా వేశాడు. 21 పరుగులు మాత్రమే ఇచ్చాడు. అతడి ఎకానమీ 1.30 అంటే బౌలింగ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.. ఇతడికి ప్రసిద్ కృష్ణ తోడయ్యాడు. అతడు కూడా రెండు వికెట్లు పడగొట్టాడు. ఎడమ చేతి వాటం స్పిన్ బౌలింగ్ తో సుతార్ అదరగొట్టాడు. పరుగులు తీయడం కాదు కదా.. బంతిని అడ్డుకుంటే చాలు అనేతీరుగా ఆఫ్ఘనిస్తాన్ బ్యాటర్లలో భయం పుట్టించాడు. ఐపీఎల్ లో అంతగా ఆకట్టుకోలేకపోయినప్పటికీ.. ఇతడి మీద గౌతమ్ గంభీర్ భారీ అంచనాలు పెట్టుకున్నాడు. ఏకైక టెస్ట్ కు అవకాశం కల్పించాడు. వచ్చిన అవకాశాన్ని సుతార్ సద్వినియోగం చేసుకున్నాడు. రాజస్థాన్లోని శ్రీ గంగా నగర్ లో పుట్టిన ఇతడు.. ఎడమ చేతివాటం బ్యాటింగ్ చేస్తాడు. ఎడమచేతి వాటం బౌలింగ్ తో ఆకట్టుకుంటాడు. ఇండియా అండర్ 19, రాజస్థాన్, సెంట్రల్ జోన్, జైపూర్ ఇండియన్స్, ఇండియా ఏ, గుజరాత్ టైటాన్స్, ఇండియా సి, రెస్ట్ ఆఫ్ ఇండియా జట్లకు ఇతడు ఆడాడు. ఎడమచేతి అర్థడాక్స్ స్పిన్నర్.. అంతేకాకుండా లోయర్ ఆర్డర్లో సమర్థవంతంగా ఆడతాడు. 2022 – 23 రంజి ట్రోఫీ సీజన్లో సుతార్ ఆరు మ్యాచ్ లు ఆడి.. 20.33 సగటుతో 39 వికెట్లు పడగొట్టాడు. ఆ సీజన్లో రాజస్థాన్ జట్టు తరుపున అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్ గా ఆవిర్భవించాడు. అంతేకాదు రెండు హాఫ్ సెంచరీలు కూడా నమోదు చేశాడు. 2023 ఏసిసి మెన్స్ ఎమర్జింగ్ కప్ లో టీమిండియా కు ఎంపిక అయ్యాడు. ఆటోర్నీలో ఐదు మ్యాచ్లు ఆడి 19.50 సగటు, 4.21 ఎకనామి రేటుతో 10 వికెట్లు పడగొట్టాడు. ఆ సిరీస్లో రెండవ అత్యధిక వికెట్లు తీసిన బౌలర్గా ఆవిర్భవించాడు. ఐపీఎల్ 2024 కోసం సుతార్ ను గుజరాత్ జట్టు కొనుగోలు చేసింది. 2002లో జరిగిన దిలీప్ కప్ ట్రోఫీలో సుతార్ 7 వికెట్లు పడగొట్టాడు. 2025 ఐపీఎల్ వేలంలో గుజరాత్ జట్టు అతడిని 30 లక్షలకు కొనుగోలు చేసింది.




## రిషబ్ పంత్ కొట్టుడుకు..
## డ్రోన్ ముక్కలైంది

**వైరల్ వీడియో**



**ముద్ర స్పోర్ట్స్ డెస్క్:**
టీమిండియాలో రిషబ్ పంత్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే అతడు ఎలాంటి ఫార్మాట్ అయినా సరే దూకుడు మంత్రాన్ని మాత్రమే పాటిస్తాడు. బంతి ఏ దిశలో వచ్చినా సరే దానిని బౌండరీ వైపు మాత్రమే పంపిస్తాడు.. ఎందుకంటే అతడికి అలాంటి బ్యాటింగ్ మాత్రమే వచ్చు. సుదీర్ఘ ఫార్మాట్.. పరిమిత ఓవర్ల ఫార్మాట్.. పొట్టి ఫార్మాట్.. ఇలా అన్ని విభాగాలలో అతడు అదరగొడతాడు. ఇటీవల ఐపీఎల్లో అతడు సత్తా చూపించలేకపోయినప్పటికీ.. ఆఫ్ఘనిస్తాన్ జట్టుతో జరుగుతున్న ఏకైక టెస్టులో అతడు హాఫ్ సెంచరీ చేసి సత్తా చూపించాడు. రిషబ్ పంత్ ఈ మ్యాచ్లో 121 బంతులు ఎదుర్కొని 81 పరుగులు చేశాడు. ఇందులో 6 ఫోర్లు.. మూడు సిక్సర్లు ఉన్నాయి. వాస్తవానికి సెంచరీకి చేరువగా వచ్చినప్పటికీ.. షాహిది బౌలింగ్ లో అతడు అవుట్ అయ్యాడు. దీంతో నిరాశతో అతడు మైదానాన్ని వీడి వెళ్లిపోయాడు.. రిషబ్ పంత్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు.. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్ బౌలింగ్లో అతడు గట్టిగా కొట్టాడు. అతడు కొట్టిన కొట్టుడుకు బంతి గాల్లోకి లేచింది. అంతేకాదు నేరుగా డ్రోన్ ను తగిలింది. అది వెంటనే కింద పడిపోయింది. ఆ సమయంలో ఆఫ్ఘనిస్తాన్ ఫీల్డర్లు ఎవరు కూడా ఆ బంతిని అందుకోవడానికి ప్రయత్నించలేదు. ఈ సంఘటన నిజమా.. కాదా అని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే.. అది అబద్ధం అని తేలింది. కొంతమంది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఆ వీడియోను రూపొందించినట్టు సమాచారం. మ్యాచ్ జరుగుతున్నప్పుడు రిషబ్ పంత్ అలాంటి షాట్ ఆడలేదని.. బంతి అలా పైకి వెళ్లలేదని అభిమానులు పేర్కొంటున్నారు. ఎందుకంటే మ్యాచ్ జరుగుతున్నప్పుడు డ్రోన్ అంత తక్కువ ఎత్తులో ఉండదు. పైగా ఇటీవల కాలంలో రోబోటిక్ కెమెరాలు వాడుతున్నారు."రిషబ్ పంత్ ఇలాంటి బ్యాటింగ్ చేయడం కొత్త కాదు. ఇలా దూకుడుగా ఆడటం కూడా తొలిసారి కాదు. కాకపోతే అతడు కొడితే బంతి ఎన్నడు కూడా డ్రోన్ కెమెరాలను తాకలేదు. వాటిని కింద కూల్చలేదు.. రిషబ్ పంత్ బ్యాటింగ్ చూస్తుంటే ఆనందంగా ఉందని" నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.



## హర్షిత్ రానా లో గంభీర్ కు ఏం నచ్చిందో?




**ముద్ర స్పోర్ట్స్ డెస్క్:**
ఈ ఐపీఎల్లో ఒక్కసారి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్ భువనేశ్వర్ కుమార్ బౌలింగ్ ప్రదర్శన చూస్తే ఎవరైనా సరే జాతీయ జట్టులోకి తీసుకుంటారు. అక్కడి దాకా ఎందుకు హేజల్ వుడ్ ఐపీఎల్లో చేసిన ప్రదర్శన చూసి ఆస్ట్రేలియా క్రికెట్ మేనేజ్మెంట్ అతడికి రెడ్ కార్పెట్ వేసింది. అంతేకాదు 2027 వరల్డ్ కప్ లో ఆడేందుకు అతడి మీద వర్క్ లోడ్ కూడా తగ్గించింది. కమిన్స్, స్టార్క్ విషయంలో కూడా ఆస్ట్రేలియా క్రికెట్ మేనేజ్మెంట్ ఇదే నిర్ణయాన్ని తీసుకుంది. ఇదేం దరిద్రమో లేదు గాని.. టీమిండియా మేనేజ్మెంట్ మాత్రం ఐపీఎల్లో సత్తా చూపించిన బౌలర్ల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. హర్షిత్ రానా మీద మాత్రం విపరీతమైన ప్రేమను చూపిస్తోంది. అతడేమి గొప్పగా వికెట్లు తీయలేదు. పేరుపొందిన ఎకానమీ బౌలర్ కూడా కాదు. కీలక సమయాలలో వికెట్లు పడగొట్టి జట్టుకు అడ్వాంటేజ్ స్థాయి కూడా అతనికి లేదు. అతనిలో ఏం నచ్చిందో తెలియదు.. గౌతమ్ గంభీర్ మాత్రం విపరీతమైన ప్రేమ చూపిస్తున్నాడు. ఈ ప్రేమకు అర్థం ఏంటో కూడా తెలియడం లేదు. గతంలో అనేక పర్యాయాలు హర్షిత్ మీద గౌతమ్ ఇదే స్థాయిలో ఆప్యాయత కనబరిచాడు. అతడికి అవకాశాల మీద అవకాశాలు కల్పించాడు.ఇటీవల కాలంలో హర్షిత్ గాయం వల్ల ఐపీఎల్ మొత్తానికి దూరమయ్యాడు. డొమెస్టిక్ క్రికెట్ కూడా ఆడలేదు. వన్డేలలో కొంతమేర పరవాలేదనుకున్నా.. టి20 లలో రికార్డ్ ఏమంత గొప్పగా లేదు. ఐపీఎల్ లో భువనేశ్వర్ కుమార్ బెంగళూరు జట్టు తరఫున అద్భుతంగా రాణించాడు. వికెట్లు పడగొట్టాడు. సూపర్ ఎకానమీ నమోదు చేశాడు. అతడిని పక్కనపెట్టి హర్షిత్ ను తీసుకోవడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు హర్షిత్ ను తీసుకొని పాండ్యా కడుపు మీద కొట్టాడని గంభీర్ మీద క్రికెట్ విశ్లేషకులు మండిపడుతున్నారు..హార్దిక్ పాండ్యా 2024 t20 వరల్డ్ కప్.. ఇటీవల జరిగిన టి20 వరల్డ్ కప్ లో అదరగొట్టాడు. అద్భుతమైన ప్రదర్శన చేశాడు. అయినప్పటికీ అతడిని పక్కన పెట్టారు. అతడిని దూరం పెట్టడం వెనుక ఉన్న కారణాన్ని మేనేజ్మెంట్ ఇంతవరకు చెప్పలేదు. హార్దిక్ పాండ్యాను పక్కనపెట్టి.. అతడి స్థానాన్ని భవిష్యత్తు కాలంలో హర్షిత్ తో భర్తీ చేస్తారా అని క్రికెట్ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. హర్షిత్ కోసం ఏకంగా నిబంధనలు కూడా మార్చారని మండిపడుతున్నారు. దీనిపై గౌతమ్ గంభీర్ ఎటువంటి రిప్లై ఇస్తాడో చూడాల్సి ఉంది.

## వైభవ్ తుఫాన్ అనుకుంటే..
## అతడి తమ్ముడు సునామి




**ముద్ర స్పోర్ట్స్ డెస్క్:**
జాతీయ క్రికెట్ జట్టుకు వైభవ్ సూర్య వంశీ ఎంపికయ్యాడు. ఇటీవలి ఐపిఎల్ లో తిరుగులేని స్థాయిలో ఆడిన తర్వాత అతడు జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ప్రస్తుతం బెంగళూరులో ఉన్నాడు. అతడి గురించి మీడియాలో రకరకాల కథనాలు వస్తున్నాయి. ఐర్లాండ్ టూర్ లో గనుక అతడు అదరగొడితే ఇక తిరుగు ఉండదు. సూర్య వంశీ గురించి ఇప్పటికే అనేక కథనాలు మీడియాలో వచ్చాయి. సూర్య వంశీ వంతు అయిపోయింది. ఇప్పుడు అతడి తమ్ముడు మొదలుపెట్టాడు. సూర్య వంశీ కి తమ్ముడికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చలో ఉంది.. భారత క్రికెట్లో సంచలన ఆటగాడిగా పేరు తెచ్చుకున్నాడు వైభవ్ సూర్య వంశీ. అతడి తమ్ముడు కూడా క్రికెటర్ కావాలని అనుకుంటున్నాడు. అంతేకాదు భవిష్యత్తులో తన అన్నను బీట్ చేస్తానని చెబుతున్నాడు. సూర్య వంశీ తమ్ముడు పేరు ఆశీర్వాద్ సూర్య వంశీ. ఇతడు బీహార్లో చదువుతున్నాడు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూలో అతడు పాల్గొన్నాడు."భవిష్యత్తు కాలంలో క్రికెట్ ఆడతావా.. మీ అన్నను నువ్వు అధిగమిస్తావా.. భారీగా పరుగులు చేయగలుగుతావా.. ఐపీఎల్ లో ఆడతావా" అని యాంకర్ ప్రశ్నలు అడిగితే.. అతడు అన్నింటికీ సమాధానం అవును అని చెప్పాడు.. "ఏది అడిగినా సరే అతడు అవును అంటున్నాడని.. ఇతడు కూడా సూర్య వంశీ లాగానే ఆడతాడేమోనని" సోషల్ మీడియాలో కామెంట్ లో వినిపిస్తున్నాయి.ఆశీర్వాద్ కూడా దృఢంగా ఉన్నాడు.. సూర్య వంశీ మాదిరిగానే బలిష్టంగా కనిపిస్తున్నాడు. సూర్య వంశీ ఇప్పటికే తుఫాన్ లాంటి ఇన్నింగ్స్ అనేకం ఆడాడు. ఆశీర్వాద్ క్రికెట్లోకి వస్తే సునామి తరహా లోనే బ్యాటింగ్ చేస్తాడేమో.. అన్నను మించిపోయి అదరగొడతాడేమోనని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. కాకపోతే ఆశీర్వాద్ మాట్లాడుతుంటే భలే అందంగా ఉన్నాడు. ప్రతి ప్రశ్నకు అతడు అవును అని సమాధానం చెబుతూ.. తనదైన హావభావాన్ని ప్రదర్శించాడు. అతడి క్యూట్ మాటలకు నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు. అతడు భవిష్యత్తు కాలంలో మంచి పేరు తెచ్చుకుంటాడని పేర్కొంటున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 08.06.2026
www.mudranews.in | @mudranews



### చేపలు తినడం వల్ల ..



బరువు నియంత్రణకు సహకారం. చేపలు తక్కువ కొవ్వు, ఎక్కువ ప్రోటీన్ కలిగి ఉండటం వల్ల ఎక్కువసేపు ఆకలి వేయకుండా చేస్తాయి. ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడంలో తోడ్పడతాయి.



# పెద్ది ఎంత కలెక్షన్స్ ను కొల్లగొట్టొచ్చు

**ముద్ర సినిమా డెస్క్:**
.తెలుగు సినిమా ఇండస్ట్రీలో రామ్ చరణ్ లాంటి నటుడు మరొకరు లేరనేది వాస్తవం... ఇప్పటివరకు ఆయన సాధించిన విజయాలు అతన్ని స్టార్ హీరోగా మార్చాయి. పాన్ ఇండియాలో సైతం విపరీతమైన పోటి ఉన్నప్పటికి రామ్ చరణ్ సినిమాల కోసం ఇండియాలో ఉన్న ప్రతి ఒక్క ప్రేక్షకుడు ఎదురుచూస్తున్నాడు అంటే ఆయన క్రేజ్ ఏ రేంజ్ లో ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. ఇక రీసెంట్ గా పెద్ది సినిమాతో ప్రేక్షకుల మనసు దోచుకున్న ఆయన తన తదుపరి సినిమాల విషయంలో కూడా చాలా క్లారిటిని మెయింటైన్ చేస్తున్నాడు. అయితే పెద్దికి మొదటి షో తోనే డివైడ్ టాక్ రావడంతో ఈ సినిమా కలెక్షన్స్ కొంతవరకు తగ్గుతున్నాయనే చెప్పాలి. ఇక ఏది ఏమైనా కూడా రామ్ చరణ్ పెద్ది సినిమాతో లాంగ్ రన్ లో 600 కోట్ల వరకు కలెక్షన్స్ ని కొల్లగొడతాడు అంటూ మేకర్స్ అయితే కాన్ఫిడెంట్ గా ఉన్నారు. మూడు రోజుల్లో ఈ మూవీ 193 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ ను అయితే రాబట్టాయి. ఇక ఈ మూవీ మీద దాదాపు 350 కోట్ల వరకు బడ్జెట్ అయితే కేటాయించారు. 600 కోట్ల కలెక్షన్స్ ను కొల్లగొట్టకపోతే మాత్రం ఈ సినిమా భారీ నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి అయితే రావచ్చు. ఇక ఏది ఏమైనా కూడా రామ్ చరణ్ లాంటి నటుడు ఈ మధ్యకాలంలో చేస్తున్న సినిమాల విషయంలో క్లారిటి ని మెయింటైన్ చేస్తున్నప్పటికి ఆ సినిమాలు ప్రేక్షకులను మెప్పించలేకపోతున్నాయి. గత సంవత్సరం 'గేమ్ చేంజర్' సినిమాతో ఇండస్ట్రీ రికార్డు లను బ్రేక్ చేస్తాడని అభిప్రాయపడ్డ తన అభిమానులకు నిరాశే మిగిలింది. భారీ బడ్జెట్ తో ఆ సినిమా రావడం రామ్ చరణ్ క్రేజ్ ని ఏమాత్రం టచ్ చేయలేకపోవడం వల్ల సినిమా భారీ డిజాస్టర్ ని మూటగట్టుకుంది. తద్వారా రామ్ చరణ్ మార్కెట్ భారీగా పడిపోయిందనే చెప్పాలి. ఇక పెద్ది సినిమాతో తన యాక్టింగ్ పర్ఫామెన్స్ అయితే నెక్స్ట్ లెవెల్లో చూపించినప్పటికి కథ విషయంలో గాని, దానిని స్క్రీన్ మీద ప్రజెంట్ చేసిన విధానం కానీ ప్రేక్షకులకు కొంతవరకు నచ్చలేదు. దాంతో మిక్స్డ్ టాక్ తో రన్ అవుతున్న ఈ సినిమా లాంగ్ రన్ లో ఎంతటి కలెక్షన్స్ ని కొల్లగొడుతుంది అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది...

**పెద్ది కోసం ఏం తిన్నాడంటే..?**

రామ్ చరణ్ హీరోగా చేసిన చాలా సినిమాలు అతన్ని టాప్ లెవల్లో నిల్చోబెట్టాయి. 'చిరుత' సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైన ఆయన ఆ తర్వాత మగధీర సినిమాతో ఇండస్ట్రీ రికార్డులను బ్రేక్ చేశాడు... అలాంటి స్టార్ హీరో ఈ మధ్యకాలంలో చేస్తున్న సినిమాలతో ఏమాత్రం మెప్పించలేకపోతున్నాడు. దాంతో రీసెంట్ గా వచ్చిన పెద్ది సినిమాతో మరోసారి ప్రేక్షకుల్లో విశేషమైన ఆదరణను సంపాదించుకున్నాడు. ఇక పెద్ది సినిమాలో కుస్తీ ఫైట్ కోసం ఆయన బాడీని ఎఫెక్టివ్ గా బిల్డ్ చేశాడు. నిజానికి రామ్ చరణ్ కి ఉన్న డెడికేషన్ చాలా గొప్పదనే చెప్పాలి... తను సినిమా కోసం ఏదైనా చేస్తాడు. ఇక అందులో భాగంగానే రామ్ చరణ్ ఈ సినిమాలో కుస్తీ ఫైట్ లో తన బాడీని చాలా అద్భుతంగా మౌల్డ్ చేసుకోగలిగాడు. అయితే తన బాడీని బిల్ట్ చేసుకోవడానికి ఆయన మాంసాన్ని ఎక్కువగా తినేవాడట. అందులో ప్రోటీన్స్ ఎక్కువగా ఉంటాయి కాబట్టి అవి అయితే ఈజీగా మజిల్స్ గ్రోత్ అవుతాయనే ఉద్దేశ్యంతోనే తన జిమ్ కోచ్ తన కి ఎప్పుడు నాన్ వెజ్ తినిపిస్తూ ఉండేవారట. మొత్తానికైతే రామ్ చరణ్ ఈ సినిమాతో ఒక భారీ సక్సెస్ ని తన ఖాతాలో వేసుకున్నాడనే చెప్పాలి. పెద్ది సినిమా కొన్ని చోట్ల డివైడ్ టాక్ ను మూటగట్టుకున్నప్పటికి ఓవరాల్ గా ఈ సినిమాకి సక్సెస్ ఫుల్ టాక్ వస్తుందంటూ సినిమా యూనిట్ నుంచి కొన్ని కామెంట్లు వ్యక్తమవుతున్నాయి. ఇక ఏది ఏమైనా ఈ సినిమా ఏ రేంజ్ సక్సెస్ ని సాధిస్తుంది. ప్రేక్షకుల్లో విశేషమైన ఆదరణ ను రాబడుతుందా? లాంగ్ రన్ లో ఈ సినిమా ఎలాంటి రికార్డులను క్రియేట్ చేస్తుంది అనేది తెలియాలంటే మాత్రం మరి కొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే...ఇక రామ్ చరణ్ సోలోగా ఇప్పటి వరకు ఏ సినిమాతో కూడా 1000 కోట్ల కలెక్షన్స్ ను కొల్లగొట్టలేదు. కానీ మొదటి సారి ఈ సినిమా ఆ రికార్డ్ ను బీట్ చేస్తుందా? లేదా అనేది తెలియాలంటే మాత్రం కొద్దిరోజులు వెయిట్ చేయాల్సిందే..

## రామ్ చరణ్ ను మోసం చేసిన ముగ్గురు దర్శకులు

మెగాస్టార్ తనయుడిగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన నటుడు రామ్ చరణ్... కెరియర్ మొదట్లోనే వరస విజయాలను అందుకున్న ఆయన ఆ తర్వాత టాప్ హీరోగా మారాడు. ముఖ్యంగా మగధీర సినిమాతో 100 కోట్ల కలెక్షన్స్ ను కొల్ల గొట్టిన మొదటి హీరోగా తెలుగు సినిమా ఇండస్ట్రీలో భారీ రికార్డులను క్రియేట్ చేశాడు. మరి అలాంటి రామ్ చరణ్ ఈ మధ్యకాలంలో చేస్తున్న సినిమాల విషయంలో కొంతవరకు తడబడుతున్నాడు. నిజానికి ఆయన నమ్మిన ముగ్గురు దర్శకులు అతన్ని దారుణంగా మోసం చేశారు. వాళ్లెవరూ అంటే మగధీర మూవీ తర్వాత ఆరెంజ్ మూవీతో బొమ్మరిల్లు భాస్కర్ అతన్ని కోలుకోలేని దెబ్బ కొట్టాడు. మూవీ కల్ట్ క్లాసికల్ గా మిగిలిపోయిన కూడా సక్సెస్ ల పరంగా ఈ సినిమా భారీ డిజాస్టర్ ని మిగిల్చింది. ఇక వినయ విధేయ రామ సినిమాతో బోయపాటి శ్రీను సైతం తనకి భారీ విజయాన్ని అందిస్తాడు అనే ఆలోచనలో రాంచరణ్ ఉండేవాడు. కానీ బోయపాటి శ్రీను తీసిన 'వినయ విధేయ రామ' మూవీ రామ్ చరణ్ కెరియర్ లోనే వరెస్ట్ మూవీగా నిలిచిందని చాలామంది చెబుతున్నారు. ఇక భారీ అంచనాలతో రిలీజ్ అయిన 'గేమ్ చేంజర్' సినిమా కూడా రామ్ చరణ్ కెరియర్ ని బాగా దెబ్బతీసింది. 'త్రిబుల్ ఆర్' తర్వాత ఉన్న డేట్స్ అన్నింటిని గేమ్ చేంజర్ మీదే పెట్టిన రామ్ చరణ్ ఆ సినిమాతో పెను సంచలనాన్ని క్రియేట్ చేస్తానని అనుకున్నాడు. కానీ శంకర్ మేకింగ్ సినిమాకి ఏమాత్రం ఉపయోగపడలేదు. కథ విషయంలో కూడా చాలా క్లారిటిని మిస్ అయ్యాడు. ఏది ఏమైనా కూడా ఈ సినిమాతో చాలా వరకు నష్టపోయాడు. ఇక ఆయన త్రిబుల్ ఆర్ రెంజ్ సక్సెస్ సాధించడానికి చాలా ప్రయత్నం చేశాడు. అయినప్పటికి తన దగ్గర ఉన్న నాసిరకం ప్రాజెక్ట్ ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు అంటూ చాలామంది విమర్శకులు సైతం కామెంట్లు చేశారు. మొత్తానికైతే పెద్ది సినిమాతో రాంచరణ్ నటన అద్భుతంగా ఉందని ప్రశంసిస్తుండటం నిజంగా చాలా గొప్ప విషయం.

# ఇరుముడి లో గెస్ట్ గా స్టార్ హీరో

**ముద్ర సినిమా డెస్క్:**
మాస్ మహారాజా రవితేజ హీరోగా చేస్తున్న 'ఇరుముడి' సినిమా భారీ అంచనాల మధ్య తెరకెక్కుతుంది...ఈ సినిమాతో రవితేజ ఎలాగైనా సరే భారీ సక్సెస్ ని సాధించాలనే లక్ష్యంతో ముందుకు దూసుకెళ్తుండటం విశేషం... ఈ మూవీ తో ఆయన మరోసారి తనను తాను స్టార్ హీరోగా ఎలివేట్ చేసుకోవాలనే ప్రయత్నం చేస్తున్నాడు. మొదటి సారి ఆయన థ్రిల్లర్ జానర్ లో సినిమా చేస్తుండటం విశేషం... ఇక ఇప్పటివరకు ఆయన అలాంటి జానర్ లో సినిమాలైతే చేయలేదు. కమర్షియల్ సినిమాలను మాత్రమే చేస్తూ వచ్చాడు. వరుసగా ఫ్లాప్ సినిమాలు రావడంతో ఆయన థ్రిల్లర్ సినిమాలవైపు ఎక్కువగా మొగ్గు చూపాడు. అయినప్పటికి తను అనుకున్న స్థాయిని చేరుకోవడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తు మొత్తానికైతే టాప్ హీరో పొజిషన్ ను అందుకున్నాడు. ఇక ఈ మధ్యకాలంలో ఆయన చేస్తున్న సినిమాలు ప్రేక్షకులను ఏమాత్రం ఇంప్రెస్ చేయడం లేదు. దాంతో మరోసారి ఆయన డిఫరెంట్ సినిమాల వైపు అడుగులు వేస్తున్నట్టుగా తెలుస్తుంది. ఇరుముడి సినిమా సక్సెస్ అయితే మాత్రం ఆయన దశ తిరిగిపోతుందనే చెప్పాలి. ఇక ఈ సినిమాలో యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి సైతం ఒక క్యారెక్టర్ లో కనిపించబోతున్నాడట. అయితే ఆయన క్యామియో రోల్ ప్లే చేస్తున్నాడా లేకపోతే ఈ సినిమాలో భాగమై సినిమా స్టోరీ కి ఇంటర్ లింక్ అయి ఆయన క్యారెక్టర్ ఉంటుందా లేదా అనేది కూడా తెలియాల్సి ఉంది... ఈ సినిమా మొత్తం రవితేజ కూతురు కోసమే ఉంటుందట. అయ్యప్ప మాల ధరించిన రవితేజ ఈ సినిమాను శాంతిగా ఉంటూనే ఉగ్రరూపాన్ని కూడా చూపించబోతున్నట్లుగా తెలుస్తుంది. ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన గ్లింప్స్ లో రవితేజ ఒక మాస్ యాక్షన్ ఎపిసోడ్ లో కూడా పాల్గొన్నాడు అంటే ఈ సినిమాలో భారీ యాక్షన్ ఎలిమెంట్స్ కూడా ఉంటాయి. ఇక ఏది ఏమైనా కూడా తనదైన రీతిలో సత్తా చాటుకుంటేనే రవితేజ ఇండస్ట్రీలో మరోసారి తన సత్తా చూపించగలుగుతాడు. లేకపోతే మాత్రం చాలా వరకు వెనుకబడిపోయే ప్రమాదం కూడా ఉంది...




**ఆ డైరెక్టర్ తో సినిమా చేస్తే టాప్ లోకి వస్తాడా?**

మాస్ మహారాజా రవితేజ ఈ మధ్యకాలంలో డిఫరెంట్ సినిమాల వైపు అడుగులు వేస్తున్నాడు. ఒకానొక సందర్భంలో కమర్షియల్ సినిమాలను నమ్ముకునే ముందుకు సాగిన ఆయన ఇప్పుడు శివ నిర్వాణ దర్శకత్వంలో 'ఇరుముడి ' సినిమాతో ఒక కొత్త ప్రయోగం చేస్తున్నాడు.ఇక ఇదిలా ఉంటే కెరియర్ స్టార్టింగ్ లో రవితేజను స్టార్ హీరోగా నిలిపిన వారిలో పూరి జగన్నాథ్ ఒకరు. వీళ్ళిద్దరి కాంబినేషన్లో వరుసగా మూడు బ్లాక్ బాస్టర్ సినిమాలు రావడం దాంతో రవితేజ స్టార్ హీరోగా మారిపోవడం జరిగింది. అయితే ఇప్పుడు రవితేజ మరోసారి పూరి జగన్నాథ్ దర్శకత్వంలో సినిమా చేస్తే బాగుంటుందని మరి కొంతమంది భావిస్తున్నారు. ఇక పూరి జగన్నాథ్ తో ఆయన సినిమా చేస్తే వీళ్ళిద్దరి కాంబినేషన్ మరోసారి బాగా వర్కౌట్ అవుతుందని చాలామంది భావిస్తున్నారు. నిజానికి వీళ్ళిద్దరి కాంబినేషన్లో సినిమా వచ్చి 10 సంవత్సరాల పైన అవుతుంది. మరి ఇలాంటి క్రమంలోనే ఇప్పుడు వీళ్ళిద్దరు కలిసి సినిమా చేస్తే బాగుంటుంది కదా అని మరి కొంతమంది కామెంట్లు చేస్తున్నారు. సినిమా మేధావులు సైతం రవితేజ పూరి జగన్నాథ్ కాంబినేషన్ ఎప్పటికీ ఎవర్ గ్రీన్ అని వాళ్ళ కాంబినేషన్లో హిట్టు, ఫ్లాప్ తో సంబంధం లేకుండా వాళ్ళిద్దరి మధ్య ఉండే ర్యాపో తో ఒక మంచి సినిమా అయితే వస్తుందని భావిస్తున్నారు. ఇక పూరి జగన్నాథ్ గతంలో లాగా ఇప్పుడుఫామ్ లో లేడు. అయినప్పటికి రవితేజ దొరికితే తను కచ్చితంగా హిట్ సినిమా తీస్తాడని మరి కొంతమంది భావిస్తున్నారు. ఇక పూరి ఇప్పుడు మరోసారి తన సత్తా చాటుకోవాల్సిన అవసరమైతే ఉంది... ఇక ఇలాంటి క్రమంలోనే రవితేజ సైతం ప్రస్తుతం కొత్త సినిమాల వైపు అడుగులు వేస్తున్నాడు. కాబట్టి పూరి జగన్నాథ్ డైరెక్షన్ లో సినిమా చేయడం కష్టమనే చెప్పాలి. ఎందుకంటే పూరి జగన్నాథ్ రొటీన్ టెంప్లేట్ లోనే సినిమాలు చేస్తుంటాడు. కాబట్టి వీళ్లిద్దరి కాంబినేషన్ వర్కౌట్ అయితే బాగానే ఉంటుంది. కానీ ఇప్పుడప్పుడే ఈ కాంబినేషన్ సెట్ అయ్యే అవకాశాలైతే లేవు...

# బాలయ్య సినిమా బడ్జెట్ పెరిగిందా?

**ముద్ర సినిమా డెస్క్:** తెలుగు సినిమా ఇండస్ట్రీలో కనీ విని ఎరుగని రీతిలో గొప్ప విజయాలను సాధిస్తున్న హీరోలలో బాలయ్య బాబు ఒకరు. సీనియర్ హీరోగా ఇండస్ట్రీలో చెలామణి అవుతూనే ప్రేక్షకులను అలరిస్తున్నాడు. ఈ మధ్యకాలం లో వరుసగా నాలుగు విజయాలను సాధించిన ఘనత కూడా తనకే దక్కింది. మధ్యలో 'అఖండ 2' సినిమా ఫ్లాప్ అయినప్పటికి ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో చేస్తున్న సినిమాతో మరోసారి పెను ప్రభంజనాన్ని సృష్టించడానికి రెడీ అవుతున్నాడు... ఇక వీళ్లిద్దరి కాంబినేషన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా బడ్జెట్ 80 కోట్లు అనుకొని బరిలోకి దిగారు. కానీ ఇప్పుడు ఆ బడ్జెట్ మరింత పెరిగిపోతుందట. దాంతో ఏం చేస్తే బాగుంటుందనే దోరణిలో బాలయ్య బాబు ఆలోచిస్తున్నట్టు గా తెలుస్తుంది. ఇక దానికి తోడుగా ఈ సినిమాను పాన్ ఇండియా రిలీజ్ చేస్తే బాగుంటుందనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారట. మరి ఈ సినిమా నుంచి తొందరలోనే గ్లింప్స్ రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇక ఇలాంటి క్రమంలోనే బాలయ్య బాబు ఇంతకుముందు చేసిన 'అఖండ 2' సినిమా ఓవర్ బడ్జెట్ కారణంగానే ఆ సినిమా బడ్జెట్ ఫెయిల్యూర్ గా మిగిలింది. మరి ఈ సినిమాతో మరోసారి తనని తాను స్టార్ హీరోగా ఎలివేట్ చేసుకుంటాడా? తనకంటూ ఒక ఐడెంటిటి ఏర్పాటు చేసుకోగలుగుతాడా లేదా అనేది తెలియాల్సి ఉంది... ఇప్పటి వరకు బాలయ్య నుంచి వచ్చిన సినిమాలేవి ప్రేక్షకులను నిరాశపరచలేదు. బాలయ్య ఏజ్ పెరిగిన కూడా ఇప్పుడు చాలా యంగ్ గా కనిపిస్తూ ప్రేక్షకులు ఎంటర్ టైన్ చేస్తున్నాడు. ఈ మధ్యకాలంలో ఆయన సినిమా సెలక్షన్ కూడా చాలా బాగుంటుంది. ముఖ్యంగా తన కూతురు అయిన తేజస్విని బాలయ్యకి ఎలాంటి కథలు అయితే సెట్ అవుతాయో అలాంటి స్టోరీస్ ను సెట్ చేసి పెడుతున్నట్టుగా తెలుస్తుంది. ఇక ఏది ఏమైనా కూడా బాలయ్య లాంటి నటుడు ఇకమీదట చేయబోతున్న సినిమాల విషయంలో సైతం చాలా కేర్ ఫుల్ గా వ్యవహరించాల్సిన అవసరమైతే ఉంది...




నందమూరి నటసింహం బాలయ్య బాబు కెరియర్ స్టార్టింగ్ లో చేసిన సినిమాల్లో ఏదో ఒక వైవిధ్యమైన కథాంశమైతే ఉంటుంది. ఇప్పటివరకు ఆయన చేసిన సినిమాలన్నీ అతన్ని హీరోగా నిలబెట్టడమే కాకుండా మాస్ లో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ను తీసుకొచ్చి పెట్టాయి. అలాంటి బాలయ్య బాబుకి ఒక దర్శకుడంటే చాలా ఇష్టమట. అతనితో

**బాలయ్యకు ఆ దర్శకుడంటే అంత ఇష్టమా?**

సినిమాలు చేయడానికి ఎప్పుడు సిద్ధంగా ఉంటానని బాలయ్య గతంలో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో క్లారిటి ఇచ్చే ప్రయత్నం చేశాడు. ఇంతకీ ఆ దర్శకుడు ఎవరు అంటే పూరి జగన్నాథ్ కావడం విశేషం... వీళ్లిద్దరి కాంబినేషన్లో ఇంతకుముందు 'పైసా వసూలు' అనే సినిమా వచ్చింది. ఈ సినిమా అనుకున్న రేంజ్ లో ఆడలేదు. కమర్షియల్ గా ఫ్లాప్ గా మిగిలిన ఈ సినిమా తన ఇమేజ్ ను మాత్రం చాలా వరకు పెంచిందనే చెప్పాలి. ఇక తన డైలాగ్ డెలివరీలో కూడా వేరే లెవెల్ మాడ్యులేషన్ ని చూపించారు. ఇక ఏది ఏమైనా కూడా బాలయ్య బాబుకి పూరి జగన్ను అంటే చాలా ఇష్టం ఏర్పడిందట. ఎందుకంటే పూరి చాలా తక్కువ సమయంలో బెస్ట్ ఔట్ పుట్ ఇచ్చే సినిమాని తీశాడు. కాబట్టి పూరి అంటే తనకు చాలా ఇష్టమని పలు సందర్భాల్లో తెలియజేశాడు. ఇక దాంతో పాటుగా పూరి జజగన్నాథ్ తో ప్రేమలో పడిపోయానని కూడా బాలయ్య చాలా ఫన్నీ కామెంట్స్ చేయడం విశేషం...ఇక ఏది ఏమైనా కూడా బాలయ్య బాబు ఈ మధ్యకాలంలో చేస్తున్న సినిమాల విషయంలో చాలావరకు వైవిధ్యాన్ని చూపిస్తున్నాడు. ఒకప్పుడు మూస ధోరణిలో ఉండే సినిమాలు చేశాడు. కానీ ఇప్పుడు వైవిధ్యభరితమైన క్యారెక్టర్ లో కనిపించడం అలాగే మరికొన్ని డిఫరెంట్ క్యారెక్టర్ లను చేయడానికి సిద్ధంగా ఉంటున్నాడు. ఇక ఏది ఏమైనా కూడా బాలయ్య బాబు పూరి జగన్నాథ్ కాంబినేషన్లో మరో సినిమా పడితే చూడాలని అటు పూరి అభిమానులు, ఇటు బాలయ్య బాబు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరి వాళ్ళు అనుకున్నట్టుగానే వీళ్ళిద్దరి కాంబినేషన్ లో మరో సినిమా వస్తుందా? లేదా అనేది తెలియాలంటే మాత్రం మరికొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే...

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com